


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 195 పేజిలు : 12, వెల రూ. 5/- ఆదివారం, సెప్టెంబరు 6, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

### కల్వకుంట్ల కుటుంబం.. కాసుకో

# సిరిసిల్ల, సిద్దిపేటలో తేల్చుకుందాం

## మా నిజాయితీ ఏంటో.. మీ బతుకేంటో అసెంబ్లీలోనే తేల్చుకుందాం

**కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. లేదంటే గౌరవంగా రాజీనామా చేయాలి**

**ఈ నెలాఖరులో సిరిసిల్లకు వస్తా.. వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా**

**వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరిగితే 117.. పాతవే ఉంటే 90 సీట్లు మావే**

**2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనే కొనసాగుతుంది**

**గత పాలన.. వెయ్యి రోజుల ప్రజాపాలనపై బహిరంగ చర్చకు సిద్ధం**

**నకిరేకల్ ప్రగతి సభలో సీఎం రేవంత్ సవాల్**



నల్లగొండ : బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి భవిష్యత్తు లేదని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్‌దే ఆది ,పత్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో సిరిసిల్లకు వచ్చి అక్కడ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానని, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తానని ప్రకటించారు. బావబామ్మర్దులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోవాలని, సిరిసిల్ల, సిద్దిపేటలో తేల్చుకుందామని, కల్వకుంట్ల కుటుంబం సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఏరియా ఆసుపత్రి భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేయి రోజుల ప్రజాపాలన ప్రగతి సభలో ఆయన

(మిగతా 2వ పేజీలో)

**"కల్వకుంట్ల కుటుంబం.. కాసుకో. ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా.. వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా. బావబామ్మర్దులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోండి.. అక్కడే తేల్చుకుందాం. కేసీఆర్ ఇకనైనా అసెంబ్లీకి రావాలి.. లేదంటే గౌరవంగా రాజీనామా చేయాలి. మా నిజాయితీ ఏంటో.. మీ బతుకేంటో అసెంబ్లీలోనే తేల్చుకుందాం. వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరిగినా, పాతవే ఉన్నా కాంగ్రెస్‌దే విజయం.**



## కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది: రాంచందర్‌రావు

**22ఏ నిషేధిత భూముల జాబితాపై రాంచందర్ రావు విమర్శలు**

**ధరణి పేరుతో ప్రజలను పీడించిన కేసీఆర్ ప్రభుత్వం ఓటమిపాలైందని ఆరోపణ**

**రేవంత్ కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని వ్యాఖ్య**

హైదరాబాద్ : సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద

(మిగతా 2వ పేజీలో)



## సీఎం రేవంత్ ను దూషించలేదు.. అప్పుడు అన్నది ఒకట్రెండు విషయాల్లోనే: రాజగోపాల్ రెడ్డి

**రేవంత్ తో తనకు వ్యక్తిగత వైరం లేదన్న రాజగోపాల్ రెడ్డి**

**తన నిజయకవర్గానికి కొడంగల్ స్థాయిలోనే నిధులు వచ్చాయని ప్రశంస**

**సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో వెళతానని వెల్లడి**

కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం

(మిగతా 2వ పేజీలో)



## యువతను కదిలిస్తే.. ప్రభుత్వాలే కదలాలి: కేటీఆర్

**రేవంత్‌రెడ్డికి యువత సత్తా ఏమిటో త్వరలోనే తెలుస్తుంది: కేటీఆర్**

**కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజం**

**ఉద్యోగాల జాడ లేదు.. అవినీతి ఆరోపణల పరంపర కొనసాగుతోందని విమర్శ**

**విద్యార్థులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపణ**

**పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేసిందంటూ ఆరోపణ**

కరీంనగర్/సిరిసిల్ల: తెలంగాణ యువతలో పోరాట స్ఫూర్తి రగిలితే ఎలాంటి శక్తివంతమైన ప్రభుత్వమైనా వెనక్కి తగ్గాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని సైతం యువత ఉద్యమాలు కదిలించిన సందర్భా లను గుర్తుచేస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువ తను తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో శనివారం నిర్వహించిన 'యువ సమర భేరి' సభలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణను సాధించుకున్న తర్వాత పదేళ్లపాటు అభివృద్ధి దిశగా ముందు కు తీసుకెళ్లామని, అయితే

(మిగతా 2వ పేజీలో)



## శిథిలాల కింద 10 రోజులు.. అయినా బతికే ఉన్నారు

**నేపాల్‌లో వరదల బీభత్సం.. మరో ఇద్దరికి పునర్జన్మ**

**శిథిలాల నుంచి 60 ఏళ్ల మహిళను బయటకు తీసిన సిబ్బంది**

**జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న చైనా జాతీయుడి రక్షణ**

**225 మీటర్ల లోతు నుంచి లూహైతావోను కాపాడిన సహాయక బృందాలు**

**సొరంగాల్లో చిక్కుకున్న వారిలో ఇప్పటివరకు ముగ్గురు సురక్షితం**

**నేపాల్ వరదల్లో 1,344కు చేరిన మృతుల సంఖ్య**

**589 మంది విదేశీయులు సహా దాదాపు 5,000 మంది గల్లంతు**

# పిల్లల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి

## విద్యార్థుల్లో మాదకద్రవ్యాల ముప్పుపై అవగాహన పెంచాలి: ప్రధాని మోదీ

**పుస్తక విద్యతో పాటు పిల్లల ప్రవర్తనపైనా దృష్టి పెట్టాలి**

**మొబైల్ వినియోగాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయ కార్యక్రమాలు చేపట్టాలి**

**క్రీడలు, వ్యాయామం, కళలు, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**ఉమ్మడి కుటుంబాలు తగ్గుతున్న నేపథ్యంలో టీచర్ల బాధ్యత మరింత పెరిగింది**

**జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ భేటీ**



న్యూఢిల్లీ: పిల్లల బాల్యాన్ని కాపాడటంతో పాటు వారిలో సహజమైన ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. విద్యార్థులను చదువులకే పరిమితం చేయకుండా వారి ప్రవర్తన, అలవాట్లు, రోజువారీ జీవన విధానంపైనా శ్రద్ధ చూపాలని చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులతో

(మిగతా 2వ పేజీలో)

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు: సంజయ్



**ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్**

**ఉపాధ్యాయులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన**

**ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్**



## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం.. రెడ్ అలర్ట్ జారీ!

**ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు**

**వాతావరణ శాఖ నుంచి రెడ్ అలర్ట్ జారీ**

**లోతట్టు ప్రాంతాలు జలమయం, విమాన సేవలకు అంతరాయం**

**ప్రయాణికులు ముందుగానే విమాన వివరాలు చూసుకోవాలని సూచన**

**రేపటి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం**

### సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?

## రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఆగ్రహం

**వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ**

**ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ**



# కల్వకుంట్ల కుటుంబం.. కాసుకో.. సిరిసిల్ల, సిద్దిపేటలో తేల్చుకుందాం

ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల సంఖ్య పెరిగితే 117 సీట్లతో, ప్రస్తుత సంఖ్యే కొనసాగితే 90 సీట్లతో 2029లో కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2024 నుంచి 2034 వరకు రెండు పర్యాయాలు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని స్పష్టం చేశారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇకనైనా అసెంబ్లీకి రావాలని, లేదంటే గౌరవంగా రాజీనామా చేయాలని సూచించారు. గజ్వేల్‌లోనే తేల్చుకుందామని సవాల్ విసిరారు.

**తెలంగాణను ఉద్ధరిస్తాడట..**

ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వెయ్యి రోజులుగా ప్రజలకు దూరంగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఏ ప్రభుత్వంలోనైనా 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే ఉద్యోగిని తొలగిస్తారని, అలాంటిది వెయ్యి రోజులుగా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ బయటకు రాకుండా జీతభత్యాలు, వాహనం, నివాసం తదితర సౌకర్యాలు పొందుతున్నారని ఆరోపించారు. ప్రజలు చెల్లించిన పన్నుల నుంచే ఆయనకు జీతం చెల్లిస్తున్నారని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉంటూ ఇప్పుడు తెలంగాణను ఉద్ధరిస్తానంటూ వస్తున్నారని ఎద్దేవా చేశారు.

**నాకు సంస్కారం ఉంది..**

తనకు చదువు రాదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి స్పందించారు. తనకు చదువు వచ్చిందో లేదో తెలియదని, కానీ సంస్కారం మాత్రం ఉందని అన్నారు. తనలో సంస్కారం లేకపోతే ప్రజలు తనను రోడ్డుపై అడుగుపెట్టనివ్వరని వ్యాఖ్యానించారు. సీతక్క, కొండా సురేఖను ఇంటికి ఆహ్వానించి రాఖీ కట్టించుకోవడం తన సంస్కారానికి నిదర్శనమన్నారు. అయితే కేటీఆర్‌కు సంస్కారం లేదని విమర్శించారు. ఆస్తి విషయంలో సొంత చెల్లికే అన్యాయం చేసిన వ్యక్తి తనను ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను మోసం చేసి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి దోచుకున్నారని బీఆర్ఎస్ కుటుంబంపై ఆరోపణలు చేశారు.

**పాలనపై చర్చకు సిద్ధం**

గత పదేళ్ల పాలనకు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల ప్రజాపాలనకు మధ్య ప్రజలు తేడాను గమనించాలని సీఎం కోరారు. నాటి సంక్షేమ పథకాలు, నేటి ప్రభుత్వ కార్యక్రమాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 25,35,000 మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.20,615 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. దీనిపై సిద్దిపేటలోనైనా, సిరిసిల్లలోనైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు అసెంబ్లీకి వచ్చి లెక్కలు తేల్చాలని సవాల్ విసిరారు. తమ నిజాయితీ ఏంటో, బీఆర్ఎస్ నేతల బతుకేంటో అసెంబ్లీలోనే తేల్చుకుందామని పేర్కొన్నారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్యం: మహేశ్‌గౌడ్**

ప్రజాపాలన ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం ఒక కుటుంబం కోసం పనిచేసిందని, ప్రస్తుత ప్రభుత్వం పేదలు, బడుగు బలహీనవర్గాలు, మైనారిటీల కోసం పనిచేస్తోందని తెలిపారు. గత పాలనలో బీసీ వర్గాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించిందని చెప్పారు.

**పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: ఉత్తమ్**

దక్షిణ తెలంగాణలో సాగునీటి సమస్యకు ఎస్ఎల్‌బీసీ సొరంగం శాశ్వత పరిష్కారమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జల సంజీవనిగా మారనున్న ఈ ప్రాజెక్టుకు ఎన్ని అవరోధాలు ఎదురైనా 2028 జూన్ నాటికి సొరంగంతోపాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రజలకు దొడ్డు బియ్యమే సరఫరా చేశారని విమర్శించారు.

**ప్రతి నియోజకవర్గానికీ ఇంటిగ్రేటెడ్ స్కూల్: అడ్లూరి**

పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# యువతను కదిలిస్తే.. ప్రభుత్వాలే కదలాలి: కేటీఆర్

కాంగ్రెస్ ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో వెల్లడించాలని ప్రశ్నించారు. యూత్ కమిషన్, ప్రైవేటు సంస్థల్లో 75 శాతం రిజర్వేషన్, యువతకు రూ.10 లక్షల రుణాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు జాబ్ కేలండర్ కనిపించడం లేదని, దాని స్థానంలో స్కాం కేలండర్ నడుస్తోందని విమర్శించారు. వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ఎన్నికల హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న డిమాండ్లను ఆయన తప్పుబట్టారు. మరోవైపు ఎన్నికల సమయంలో యువతకు భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వాటి గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. యువత, నిరుద్యోగులు తమ సమస్యలపై ప్రశ్నిస్తే వారిని అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యాసంస్థలకు సంబంధించిన విలువైన భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు ఉపయోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ అండగా ఉంటుందని, జీవో 97 రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో పరిశ్రమలకు పెట్టుబడులు తీసుకురావడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని కేటీఆర్ చెప్పారు. టీఎస్--ఐపాస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షించి సుమారు 6.50 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించామని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, విద్యార్థులకు ఆర్థిక సాయం, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా కరీంనగర్ జిల్లా పర్యటనలో కేటీఆర్ ప్రయాణిస్తున్న కారును అలుగునూర్ వద్ద లారీ ఢీకొంది. ప్రమాద సమయంలో ఆయన కారులోనే ఉన్నారు. లారీ ఢీకొనడంతో వాహనం స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం ఆయన తన పర్యటనను కొనసాగించారు. సమరభేరి సభలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పాటు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ‘ఆపరేషన్ సిందూర్’ దెబ్బ.. భారత్‌పై పాక్ కొత్త ఉగ్ర వ్యూహం



భారత్‌పై ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ మార్చుకుంటున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. నేరుగా పాక్ సంబంధాలు బయటపడకుండా కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు పేర్కొన్నాయి. ముఖ్యంగా ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ పూర్తిగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల పాత ఉగ్ర మాన్యువల్స్‌ను వాడటం తగ్గించినట్లు సమాచారం. ఇవి భారత దర్యాప్తు సంస్థలకు బాగా పరిచయం కావడంతో దాడుల వెనుక పాక్ సంబంధాలను గుర్తించడం సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ పేరుతో ఉన్న మార్గదర్శకాలను విదేశాల్లోని హ్యాండ్లర్లు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ఇస్లామాబాద్, కరాచీ, రావల్పిండి నుంచి ఆదేశాలు వచ్చేవని చెప్పారు. ప్రస్తుతం సిరియా, ఇరాక్ వంటి ప్రాంతాల నుంచి హ్యాండ్లర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. భారత్‌లోని యువతను నేరుగా సంప్రదించకుండా సోషల్ మీడియా ద్వారా లక్ష్యంగా చేసుకుంటున్నారని అధికారులు వివరించారు. ముందుగా వ్యక్తుల ప్రొఫైల్స్‌ను గుర్తిస్తారు. ఆ తర్వాత పరిచయం పెంచుకొని నియామకం, మత ఛాందసవాదం వైపు మళ్లించడం, దాడులకు ప్రణాళిక రూపొందించడం జరుగుతున్నట్లు తెలిపారు.

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం: బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం
## మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్



ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## శిథిలాల కింద 10 రోజులు.. అయినా బతికే ఉన్నారు

కఠ్మాండు: నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ వరదలు, ఆకస్మిక వరదల మధ్య మరో రెండు అద్భుత రక్షణ ఘటనలు చోటుచేసుకున్నాయి. మృత్యువు అంచుల వరకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. నువాకోట్ జిల్లా బిదుర్ పట్టణంలో వరదల కారణంగా కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం శిథిలాల కింద చిక్కుకున్న 60 ఏళ్ల చండికా శ్రేష్టను సహాయక సిబ్బంది 10 రోజుల తర్వాత సజీవంగా గుర్తించి రక్షించారు. భవన శిథిలాల మధ్య పేరుకుపోయిన బురద, ఒండ్రు మట్టిని తొలగిస్తూ సహాయక సిబ్బంది ఆమెను బయటకు తీసుకొచ్చారు. శనివారం జరిగిన ఈ రక్షణ ఘటనకు సంబంధించిన దృశ్యాలను నేపాల్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న చండికా శ్రేష్టను బయటకు తీసిన తర్వాత ఆమె క్రమంగా స్పృహలోకి వచ్చినట్లు ఆ దృశ్యాల్లో కనిపించింది. సిబ్బంది ఆమెను దుప్పటి, జాకెట్‌తో కప్పి ప్రాథమికంగా సంరక్షించారు. అనారోగ్యంతో ఉన్న ఆమెను మెరుగైన చికిత్స కోసం వెంటనే హెలికాప్టర్‌లో కఠ్మాండులోని ఆసుపత్రికి తరలించారు. రసువా జిల్లాలో వరదల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న అప్పర్ త్రిశూలి 1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి మరో వ్యక్తిని సజీవంగా బయటకు తీసుకొచ్చారు. చైనా జాతీయుడైన లూహైతావో వరదల సమయంలో ‘ఆడిట్ టన్నెల్ 4’లో చిక్కుకుపోయాడు. నేపాలీ సైన్యం, విదేశీ సహాయక సిబ్బంది కలిసి చేపట్టిన సహాయక చర్యల్లో అతడిని శనివారం రక్షించారు. సొరంగ మార్గంలో దాదాపు 225 మీటర్ల లోపల ఉన్న ప్రాంతం నుంచి అతడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు. ఈ ఘటనతో త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగాల నుంచి సజీవంగా బయటపడిన కార్మికుల సంఖ్య మూడుకు చేరింది. అంతకుముందు శుక్రవారం త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్లాంట్‌లోని సొరంగం నుంచి కబిర్ మహర్జన్, సంజయ్ షా అనే ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది రక్షించారు. అయితే ప్రమాదం నుంచి బయటపడాల్సిన వారి సంఖ్య ఇంకా భారీగానే ఉంది. నేపాల్‌లో పదికిపైగా జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద కనీసం 900 మంది కార్మికులు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో సుమారు 500 మంది సొరంగాల లోపల చిక్కుకుని ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ ను దూషించలేదు.. అప్పుడు అన్నది ఒకట్రెండు విషయాల్లోనే: రాజగోపాల్‌రెడ్డి

ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

## పిల్లల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి

ఢిల్లీలోని తన నివాసంలో మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్య, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గిపోతుండటంతో పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత ప్రాధాన్యం సంతరించుకుందని మోదీ పేర్కొన్నారు. ఇంట్లో లభించే మార్గనిర్దేశానికి కొంతమేర లోటు ఏర్పడుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో టీచర్లు విద్యార్థులకు మంచి దిశానిర్దేశం చేయాలని సూచించారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి సహజ ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాలని చెప్పారు. తరగతి గదిలో బోధనను ఆసక్తికరంగా మార్చేందుకు సృజనాత్మక పద్ధతులను అనుసరించాలని కోరారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుండటంపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో మాదకద్రవ్యాల ముప్పు ఎలాంటి రూపంలో ఉందో గుర్తించడం కష్టంగా మారుతోందన్నారు. విద్యార్థుల్లో ఈ ప్రమాదంపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు ముందుండాలని సూచించారు. ఎవరైనా విద్యార్థి మాదకద్రవ్యాల అలవాటుకు లోనైనట్లు గుర్తిస్తే వారిని నిందించకుండా, ఆ వ్యసనం నుంచి బయటపడేలా సహాయం చేయాలని చెప్పారు. పిల్లల జీవితాల్లో బాల్యాన్ని సజీవంగా ఉంచడం ద్వారా వారిని చెడు అలవాట్లకు దూరంగా ఉంచవచ్చని పేర్కొన్నారు.

**మొబైల్‌కు బదులు ఆటలు, కళలు**

విద్యార్థుల్లో మొబైల్ ఫోన్లు, ఇతర తెరల వినియోగ సమయం పెరగడం మరో పెద్ద సమస్యగా మారిందని మోదీ అన్నారు. పిల్లలు రోజులో ఎంతసేపు తెరల ముందు గడుపుతున్నారు, ముఖ్యంగా రాత్రివేళల్లో మొబైల్ ఫోన్లను ఎంతసేపు ఉపయోగిస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులతో చర్చించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలపై కేవలం నియంత్రణ విధించడం కంటే వారికి ఆసక్తికరమైన ప్రత్యామ్నాయాలను అందించడం ద్వారా తెరల వినియోగాన్ని తగ్గించవచ్చని చెప్పారు. క్రీడలు, శారీరక వ్యాయామం, బహిరంగ ఆటలు, కళలు, సృజనాత్మక కార్యక్రమాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచాలని ప్రధాని సూచించారు. ఇటువంటి కార్యకలాపాలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడటంతో పాటు వారి తెరల వినియోగ సమయాన్ని కూడా సహజంగానే తగ్గిస్తాయని తెలిపారు. చదువును నిజ జీవిత నైపుణ్యాలతో అనుసంధానం చేస్తే విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి మరింత పెరుగుతుందని మోదీ పేర్కొన్నారు.

## కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది: రాంచందర్‌రావు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ‘ధరణి’తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?: రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు ‘ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే’ అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం.. రెడ్ అలర్ట్ జారీ!

దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షం ముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి ‘రెడ్ అలర్ట్’ జారీ చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయని విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది. నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్‌లో మోటార్ల సాయంతో నీటిని తోడివేస్తున్నప్పటికీ, కొన్ని దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రేటర్ నోయిడా, నోయిడా ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాల ప్రభావంతో ఢిల్లీ వాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అయితే, ఆదివారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, సెప్టెంబర్ 7 నుంచి కేవలం తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు: బండి సంజయ్

ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు.

# పోరాటాల రాజకీయమా..
# ప్రజా సమస్యల పరిష్కారమా?

**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు కేంద్రబిందువుగా మారాయి. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ఇప్పుడు రోడ్ల మీదకు వచ్చింది. ప్రభుత్వం 1000 రోజుల పాలనను ప్రజాపాలన విజయాలుగా వివరిస్తుంటే.. బీఆర్ఎస్ అదే 1000 రోజులను వైఫల్యాల జాబితాగా చూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతోంది. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు బీఆర్ఎస్ ప్రకటించిన వారంపాటు కార్యక్రమాల్లో నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రైతు సమావేశాలు, విద్యార్థి-యువజన కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై నిరసనలు చేపడుతోంది.**

మరోవైపు కాంగ్రెస్ కూడా ప్రతిపక్ష ఆరోపణలకు రాజకీయంగానే సమాధానం ఇస్తోంది. అధికారంలో ఉన్న పార్టీకి పాలనను సమర్థించుకోవడం ఎంత అవసరమో.. ప్రతిపక్షానికి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం అంతే అవసరం. కానీ ఈ రెండు పాత్రలు ప్రజాస్వామ్యంలో ఒక పరిమితిని దాటితే మాత్రం అసలు సమస్య పక్కకు వెళ్లిపోతుంది. ధర్నా ఎవరు చేశారు? ఎక్కడ చేశారు? ఎవరిని తిట్టారు? ఎన్ని ఫ్లెక్సీలు పెట్టారు? ఎన్ని వాహనాలు వచ్చాయి? అనే ప్రశ్నలే ముందుకు వచ్చి.. రైతుకు నీళ్లు ఎప్పుడు వస్తాయి? విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు అందుతుంది? నిరుద్యోగికి ఉద్యోగం ఎప్పుడు వస్తుంది? మహిళకు హామీ ఇచ్చిన సాయం ఎప్పుడు అందుతుంది? అనే అసలు ప్రశ్నలు వెనక్కి వెళ్లిపోతాయి.



**తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న రాజకీయ వాతావరణాన్ని ఈ కోణంలోనే పరిశీలించాల్సిన అవసరం ఉంది. ధర్నా ప్రజాస్వామ్యంలో ఒక బలమైన ఆయుధం. అది కేవలం రాజకీయ ప్రదర్శన కాదు. ప్రజల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య మార్గం. కానీ ధర్నా సమస్యకు పరిష్కారం చూపే దిశగా సాగితేనే దానికి అర్థం ఉంటుంది. లేకపోతే అది కెమెరాల ముందు జరిగే రాజకీయ కార్యక్రమంగా మిగిలిపోతుంది.**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భం ఈ రాజకీయ పోరాటానికి ప్రధాన వేదికగా మారింది. బీఆర్ఎస్ ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై 'చార్జ్‌షీట్' విడుదల చేసి.. హామీల అమలు, రైతుల సమస్యలు, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ పథకాలు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించింది. అధికార కాంగ్రెస్ మాత్రం తన పాలనలో వ్యవసాయం, సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగ నియామకాలు, మౌలిక వసతుల రంగాల్లో సాధించిన పురోగతిని ప్రజల ముందు ఉంచుతోంది. ప్రభుత్వ వాదన ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ నియామకాలు వంటి అంశాల్లో చర్యలు తీసుకున్నామని చెబుతోంది.

**అంటే రాష్ట్రంలో ఒకే కాలానికి రెండు భిన్నమైన రాజకీయ చిత్రాలు ప్రజల ముందున్నాయి. అధికార పార్టీకి ఇది అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల కాలం. ప్రతిపక్షానికి ఇది హామీల భంగం, పాలనా వైఫల్యాలు, రైతులు-యువతను నిరాశపరిచిన కాలం. ఈ రెండు వాదనల్లో ఏది నిజమో నిర్ణయించాల్సింది చివరకు ప్రజలే. కానీ ప్రజలకు ఆ నిర్ణయం తీసుకునేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని ఇరు పార్టీలు ఇవ్వాలి.**

### ధర్నా రాజకీయాలకు కొత్త ఊపు

బీఆర్ఎస్ చేపట్టిన తాజా ఆందోళనల్లో రైతు సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల అంశంపై మిర్యాలగూడలో రైతు మహాధర్నా నిర్వహించింది. అక్కడ కేటీఆర్ పాల్గొని.. నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 14లోగా స్పష్టత రాకపోతే పాదయాత్ర చేపడతానని ప్రకటించారు.

**ఈ అంశాన్ని కేవలం బీఆర్ఎస్ రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయడం కూడా సరికాదు. నీటి సమస్య నిజంగా రైతుల పంటలపై ప్రభావం చూపుతుంటే ప్రభుత్వం దానికి సమాధానం చెప్పాలి. నీరు ఎందుకు విడుదల కాలేదు? అందుబాటులో ఉన్న నీటి పరిమాణం ఎంత? సాగు అవసరాలు ఏమిటి? ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఉన్నాయి? పొరుగు రాష్ట్రాలతో నీటి పంపిణీ పరిస్థితి ఏమిటి? అనే వివరాలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. అదే సమయంలో బీఆర్ఎస్ కూడా తన హయాంలో నీటి నిర్వహణ ఎలా జరిగింది, అప్పటి పరిస్థితులు ఏమిటి అనే విషయాలను పూర్తి గణాంకాలతో ప్రజల ముందుంచాలి.**

వరంగల్‌లో కూడా బీఆర్ఎస్ రైతు సమస్యలపై ధర్నా నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. అంటే బీఆర్ఎస్ ఇప్పుడు తన రాజకీయ పునరుద్ధరణకు రైతు సమస్యలను ఒక ప్రధాన ఆయుధంగా ఉపయోగించుకుంటోంది. ఇది సహజమే. తెలంగాణ రాజకీయాల్లో రైతు ఓటు కీలకమైనది. అయితే రైతు సమస్యను రాజకీయ నినాదంగా మాత్రమే కాకుండా విధాన చర్చగా మార్చగలిగితేనే ఈ ఉద్యమాలకు దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుంది.

### కాంగ్రెస్‌కు అసలు సవాలు ఇదే

ప్రతిపక్షం ధర్నాలు చేస్తోందని కాంగ్రెస్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో అది సహజ ప్రక్రియ. కానీ ధర్నాల్లో వినిపిస్తున్న ఆరోపణలకు ప్రజలకు నమ్మకం కలిగించే సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంది. ప్రభుత్వం బీఆర్ఎస్ ఆరోపణలను తిప్పికొట్టడానికి కేవలం గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తే సరిపోదు. "వాళ్లు చేయలేదు" అనే సమాధానం ఐదేళ్ల పాలనకు శాశ్వత రక్షణ కవచం కాదు. ప్రభుత్వానికి ఉన్న అసలు బలం తన పనితీరులో ఉండాలి. ఒక రైతు తన పంటకు నీరు పొందితే.. ఒక విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సమయానికి అందితే.. ఒక నిరుద్యోగికి ఉద్యోగం లభిస్తే.. ఒక పేద కుటుంబానికి ఇల్లు వస్తే.. ఒక గ్రామానికి రోడ్డు పూర్తయితే.. ఆ పనులే ప్రభుత్వానికి రాజకీయ సమాధానాలుగా మారతాయి. ప్రతి ఆరోపణకు వేదికల మీద గంటల తరబడి సమాధానం చెప్పడం కంటే.. ప్రభుత్వ పనితీరును గణాంకాలతో, ఫలితాలతో చూపించడం మరింత ప్రభావవంతమైన రాజకీయ వ్యూహం. 1000 రోజుల పాలన పూర్తయినప్పుడు ప్రభుత్వం తన పనితీరుపై శ్వేతపత్రం తరహాలో పూర్తి వివరాలు విడుదల చేస్తే మరింత విశ్వసనీయత వస్తుంది. ఎన్ని హామీలు అమలు చేశాం? ఎన్ని దశల్లో ఉన్నాయి? ఏ హామీలు అమలు కాలేదు? ఎందుకు కాలేదు? ఎప్పుడు అమలు చేస్తాం? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. అప్పుడే ప్రతిపక్షం చేస్తున్న 'హామీల భంగం' ఆరోపణకు వాస్తవ పరీక్ష జరుగుతుంది.

### బీఆర్ఎస్‌కు కూడా కొన్ని ప్రశ్నలు

**అదే సమయంలో బీఆర్ఎస్ కూడా తనను తాను ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న పార్టీగా తన పాలనపై ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కేవలం కాంగ్రెస్‌ను విమర్శించడం సరిపోదు. ప్రజలు గతాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఏ ప్రభుత్వమైనా తన పాలనలో చేసిన మంచి పనులతో పాటు ఎదురైన సమస్యలకు కూడా జవాబు చెప్పాల్సిందే. బీఆర్ఎస్ ప్రస్తుతం కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తోంది. ఇది ప్రజాస్వామ్యపరంగా సముచితమే. కానీ అదే సమయంలో తన పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు, అమలు చేసిన కార్యక్రమాలు, అమలు కానివి, ఎదురైన ఆర్థిక పరిమితులు వంటి అంశాలను కూడా ప్రజల ముందుంచితే ఆ పార్టీ విమర్శలకు మరింత బలం వస్తుంది. "మా పాలనలో ఇదంతా చేశాం" అని చెప్పడం కంటే.. "ఇదిగో గణాంకాలు, ఇదిగో ఫలితాలు, ఇదిగో అప్పటి పరిస్థితి, ఇదిగో ఇప్పుడు పరిస్థితి" అని వివరించడం అవసరం. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. కానీ ప్రతి సమస్యను రాజకీయ యుద్ధంగా మార్చకూడదు. విద్యార్థుల సమస్య అయితే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పోరాడాలి. రైతు సమస్య అయితే రైతు పంటను దృష్టిలో పెట్టుకుని పోరాడాలి. ఉద్యోగాల సమస్య అయితే నియామక ప్రక్రియ వేగవంతం అయ్యేలా ఒత్తిడి చేయాలి. అదే నిజమైన ప్రతిపక్ష పాత్ర.**

### హామీల లెక్క ఎవరు తేలుస్తారు?

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు "హామీలు" అనే పదం అత్యంత కీలకంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్నాయా లేదా అన్నది ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రశ్న. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ పదేపదే ప్రస్తావిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ ఇప్పటికే అమలు చేసిన పథకాలను చూపిస్తోంది.

**ఇక్కడ అవసరమైనది ఆరోపణల పోటీ కాదు.. హామీల లెక్క.**

**ఉదాహరణకు ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం ఎన్ని నియామకాలు చేపట్టింది? ఎన్ని పోస్టులు భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీలు ఉన్నాయి? నియామక ప్రక్రియలో ఆలస్యం ఎందుకు జరుగుతోంది? పరీక్షలు, ఫలితాలు, నియామక పత్రాల మధ్య సమయం ఎంత? అనే అంశాలను స్పష్టంగా ప్రకటించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా బకాయిలు ఎంత? ప్రభుత్వం ఇప్పటివరకు ఎంత చెల్లించింది? ఇంకా ఎంత చెల్లించాలి? ఏ తేదీకి బకాయిలు పూర్తిగా చెల్లిస్తారు? అనే వివరాలు విద్యార్థులకు తెలియాలి. బీఆర్ఎస్ ఆరోపణల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం ప్రధానంగా ఉంది. ప్రభుత్వం ఈ లెక్కలను ప్రజల ముందు పెడితే రాజకీయ ప్రచారం వాస్తవ చర్చగా మారుతుంది.**

### ధర్నాల వెనుక యువత

రైతుల తర్వాత తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన వర్గం యువత. ఉద్యోగాలు, విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, నైపుణ్యాభివృద్ధి, పోటీ పరీక్షలు, ప్రైవేట్ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి అంశాలు యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. బీఆర్ఎస్ కూడా తన తాజా ఆందోళనల్లో యువత, విద్యార్థుల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఉద్యోగ క్యాలెండర్ లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని ఆ పార్టీ విమర్శిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ నియామకాలు చేపట్టామని, విద్యారంగంలో సంస్కరణలు చేస్తున్నామని చెబుతోంది. ఈ రెండు వాదనల మధ్య నిజం ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ఒక సమగ్ర ఉద్యోగ శ్వేతపత్రం అవసరం. తెలంగాణలో మొత్తం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు ఎంత? గత 10 ఏళ్లలో ఎన్ని భర్తీ అయ్యాయి? ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్ని నియామకాలు జరిగాయి? ఇంకా ఎన్ని నోటిఫికేషన్లు రావాలి? అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. యువతకు రాజకీయ నినాదాలు కాదు.. స్పష్టమైన అవకాశాలు కావాలి. ధర్నాకు వచ్చి నినాదాలు చేసే నాయకుల కంటే ఉద్యోగం వచ్చేలా వ్యవస్థను మార్చే నాయకత్వమే యువతకు అవసరం.

### రైతు ధర్నా.. రాజకీయ ధర్నా కాకూడదు

రైతు సమస్యలపై జరుగుతున్న ధర్నాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే రైతు సమస్యను పార్టీ రాజకీయాలకు పరిమితం చేస్తే నష్టం రైతుదే. సాగునీరు, పంట బీమా, రుణాలు, రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, మార్కెట్ ధరలు, విద్యుత్, ఎరువులు.. ఇవన్నీ రైతు జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసే అంశాలు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీటి అంశంపై మిర్యాలగూడలో జరిగిన ధర్నా ఈ విషయాన్ని మరోసారి ముందుకు తెచ్చింది. కేటీఆర్ నీటి విడుదలకు గడువు పెట్టి పాదయాత్రకు సిద్ధమని ప్రకటించడం ద్వారా ఈ అంశాన్ని రాష్ట్ర రాజకీయ చర్చలోకి తీసుకొచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం చేయాల్సిందేమిటంటే రాజకీయ విమర్శలకు రాజకీయ సమాధానం ఇవ్వడం కాదు. రైతులకు నీటి పరిస్థితిని వివరించడం. నీటి విడుదలకు షెడ్యూల్ ఉంటే ప్రకటించడం. సమస్య ఉంటే కారణం చెప్పడం. పరిష్కారం ఉంటే అమలు చేయడం. అదే సమయంలో బీఆర్ఎస్ కూడా రైతులను రాజకీయ సభకు ప్రేక్షకులుగా కాకుండా సమస్యకు భాగస్వాములుగా చూడాలి. ధర్నా ముగిసిన తర్వాత రైతుకు ఏం లభించింది అన్నదే అసలు కొలమానం.

### సభలు పెరిగినా.. సమస్యలు తగ్గుతున్నాయా?

తెలంగాణలో రాజకీయ సభలు, ధర్నాలు, ర్యాలీలు పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో ఒక ప్రశ్న మాత్రం పెరగాలి–ఈ కార్యక్రమాల వల్ల తమ జీవితాల్లో ఏమైనా మార్పు వస్తుందా?

**ఒక నియోజకవర్గంలో ధర్నా జరిగింది. మీడియా వార్త వచ్చింది. నాయకుడు ఘాటుగా మాట్లాడారు. ప్రత్యర్థిపై తీవ్ర విమర్శలు చేశారు. మరుసటి రోజు మరో పార్టీ ప్రతిస్పందించింది. మరో సమావేశం జరిగింది. ఈ చక్రం కొనసాగుతూనే ఉంటుంది. కానీ ధర్నాకు కారణమైన సమస్య మాత్రం అలాగే ఉంటే ప్రజాస్వామ్య ప్రక్రియ తన లక్ష్యాన్ని చేరలేదని అర్థం. ధర్నాకు ఒక ముగింపు ఉండాలి. డిమాండ్ ఉండాలి. గడువు ఉండాలి. ప్రభుత్వ స్పందన ఉండాలి. పరిష్కారం లేకపోతే తదుపరి చర్య ఉండాలి. అప్పుడు మాత్రమే ధర్నా ఒక రాజకీయ కార్యక్రమం నుంచి ప్రజా ఉద్యమంగా మారుతుంది.**

### కాంగ్రెస్-బీఆర్ఎస్ పోరాటం ఎటు?

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరు ఇప్పటితో ఆగేలా కనిపించడం లేదు. 1000 రోజుల పాలనను బీఆర్ఎస్ రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ మాత్రం తన పాలనను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రతిపక్ష ఆరోపణలను ఎదుర్కోవాలని ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ ఇప్పటికే వారం రోజుల ఆందోళన కార్యక్రమాలను ప్రకటించింది. ఈ పోరు రాబోయే రాజకీయ సమీకరణాలకు కూడా సంకేతం కావచ్చు. అధికార పార్టీకి మధ్యంతరంగా ప్రజల్లో తన పనితీరును బలపరచుకోవాల్సిన అవసరం ఉంటుంది. ప్రతిపక్షానికి తన ఉనికిని చాటుకోవాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఓటమి తర్వాత బీఆర్ఎస్ తన క్యాడర్‌ను మళ్లీ ఉద్యమాల వైపు మళ్లించడం రాజకీయంగా సహజమైన ప్రయత్నం. కానీ తెలంగాణ రాజకీయాలు కేవలం ఇద్దరు పార్టీల మధ్య మాటల యుద్ధంగా మారకూడదు. ప్రజల సమస్యలే రాజకీయ చర్చకు కేంద్రంగా ఉండాలి.

### రాజకీయ పోటీ మంచిదే.. కానీ

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోటీ తెలంగాణకు మంచిదే. అధికార పార్టీపై బలమైన ప్రతిపక్షం ఉండటం ప్రజాస్వామ్యానికి అవసరం. ప్రతిపక్షం ప్రశ్నిస్తే ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుంది. ప్రభుత్వం పనిచేస్తే ప్రతిపక్షం తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. చివరకు లాభపడేది ప్రజలే. కానీ పోటీ విధానాల మధ్య ఉండాలి. ఒక పార్టీ "మేము ఇది చేస్తాం" అంటే మరో పార్టీ "ఇది ఇలా చేయాలి" అని ప్రత్యామ్నాయం చెప్పాలి. ఒక పార్టీ "ఇంత ఖర్చు చేశాం" అంటే మరో పార్టీ "ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఇలా చేయవచ్చు" అని చెప్పాలి. ఒక పార్టీ "ఇన్ని ఉద్యోగాలు ఇచ్చాం" అంటే మరో పార్టీ "ఇంకా ఇన్ని ఖాళీలు ఉన్నాయి.. వీటిని ఇలా భర్తీ చేయాలి" అని చెప్పాలి.

### అదే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం.

వ్యక్తిగత విమర్శలు, కుటుంబాలపై వ్యాఖ్యలు, పరస్పర ఆరోపణలు, రాజకీయ దూషణలు కొంతకాలం వార్తల్లో నిలవవచ్చు. కానీ అవి ప్రజల జీవితాలను మార్చవు.

### తెలంగాణకు కావాల్సింది 'ధర్నా తర్వాతి కార్యాచరణ'

**ఇక ముందు తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రమాణం రావాలి. ప్రతి ధర్నా తర్వాత ఒక కార్యాచరణ ఉండాలి. బీఆర్ఎస్ ఏ సమస్యపై ధర్నా చేసినా.. ఆ డిమాండ్లను లిఖితపూర్వకంగా ప్రభుత్వానికి ఇవ్వాలి. ప్రభుత్వం వాటిపై తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రతి నిరసనపై రాజకీయంగా స్పందించకుండా.. సమస్య వాస్తవమైతే పరిష్కరించాలి. అదే విధంగా ప్రతిపక్షం చేసే ప్రతి ఆరోపణను ప్రభుత్వం అబద్ధమని కొట్టిపారేయకుండా, వాస్తవమైతే అంగీకరించే రాజకీయ పరిపక్వత చూపాలి. ప్రభుత్వం చేసే ప్రతి పనిని బీఆర్ఎస్ కూడా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలకు మద్దతు ఇవ్వడం కూడా ప్రతిపక్ష బాధ్యతే. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఉద్యమ రాజకీయాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. ఉద్యమం, ధర్నా, నిరసన అనేవి తెలంగాణ రాజకీయ సంస్కృతిలో కొత్తవి కావు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమం నుంచి పాలన వైపు మారాల్సిన అవసరం వచ్చింది. ఇప్పుడు రాజకీయ పార్టీలు మరోసారి ఉద్యమ భాషను ఉపయోగిస్తున్నాయి. ఈసారి ఆ ఉద్యమ భాష ప్రజల సమస్యల పరిష్కారానికి దారితీయాలి.**

### చివరికి ప్రజల తీర్పే తుది తీర్పు

కాంగ్రెస్ 1000 రోజుల పాలనను ఎంత గొప్పగా చెప్పుకున్నా.. బీఆర్ఎస్ ఎన్ని ధర్నాలు చేసినా.. చివరకు ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే ప్రభుత్వాల పనితీరుకు అసలు కొలమానం. ధర్నా వేదికపై ఎన్ని వేల మంది ఉన్నారన్నది కాదు.. ఆ ధర్నా తర్వాత ఎంతమంది రైతులకు నీరు వచ్చింది అన్నదే ముఖ్యం. సభలో ఎన్ని నినాదాలు వినిపించాయన్నది కాదు.. ఎంతమంది యువతకు ఉద్యోగాలు వచ్చాయన్నదే ముఖ్యం. ఎన్ని హామీలను గుర్తు చేశారన్నది కాదు.. ఎన్ని హామీలు అమలయ్యాయన్నదే ముఖ్యం. కాంగ్రెస్‌కు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని గౌరవించి పాలనలో స్పష్టత, వేగం, పారదర్శకత పెంచాలి. బీఆర్ఎస్ తనకు దక్కిన ప్రతిపక్ష పాత్రను బాధ్యతగా నిర్వర్తించి ప్రజా సమస్యలను రాజకీయ ప్రయోజనాలకు మించి ముందుకు తీసుకెళ్లాలి. ధర్నాలు ఆగిపోవాల్సిన అవసరం లేదు. నిరసనలు కూడా ప్రజాస్వామ్యానికి అవసరమే. కానీ ధర్నాలు సమస్యలను పెంచేవిగా కాకుండా పరిష్కారాలను సాధించేవిగా ఉండాలి. అధికార పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రతిపక్షం విజయం కాదు. ఆ నినాదం వల్ల ప్రభుత్వం ఒక సమస్యను పరిష్కరించడం అసలైన విజయం. అదేవిధంగా ప్రతిపక్షం ధర్నా చేస్తే దాన్ని అణచివేయడం అధికార పార్టీ బలం కాదు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనకు అవకాశం ఇచ్చి, సరైన సమస్య అయితే పరిష్కరించడం ప్రభుత్వ పరిపక్వత. తెలంగాణ ఇప్పుడు మరో రాజకీయ యుద్ధాన్ని చూస్తోంది. ఒకవైపు అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకునే కాంగ్రెస్.. మరోవైపు ప్రజల్లో తన బలాన్ని తిరిగి పెంచుకోవాలనుకునే బీఆర్ఎస్. ఇరుపక్షాలూ ధర్నాలు, సభలు, విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ వేడిని పెంచుతున్నాయి. కానీ ఈ రాజకీయ వేడి ప్రజల ఇళ్లలో వెలుగుగా మారుతుందా? రైతు పొలంలో నీరుగా మారుతుందా? యువత చేతిలో ఉద్యోగంగా మారుతుందా? విద్యార్థి చదువులో భరోసాగా మారుతుందా? పేద కుటుంబానికి గృహంగా మారుతుందా? అన్నదే తెలంగాణ ప్రజలు అడగాల్సిన అసలు ప్రశ్న. ధర్నా ఎవరు చేశారన్నది చరిత్రలో చిన్న విషయం. ధర్నా ఎందుకు చేయాల్సి వచ్చిందన్నది పెద్ద విషయం. దాని తర్వాత సమస్య పరిష్కరించబడిందా లేదా అన్నదే ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష.



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం హామీ

**అసెంబ్లీ సమావేశాల అనంతరం ఏర్పాటు చేస్తామని హామీ.. 8న చలో ఇందిరాపార్క్ ధర్నా వాయిదా**



హైదరాబాద్:అరుణ ప్రభ.రెడ్డి సమాజానికి ఇచ్చిన హామీ మేరకు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి రాష్ట్రంలోని వివిధ రెడ్డి సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రెడ్డి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమం, విద్య, ఉపాధి తదితర అంశాలపై నాయకులు ప్రభుత్వ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. చర్చల అనంతరం రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్‌ను అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చినట్లు రెడ్డి సంఘాల నాయకులు తెలిపారు. అదేవిధంగా రెడ్డి సమాజానికి దక్కాల్సిన సంక్షేమ పథకాలను ప్రభుత్వం తరఫున అమలు చేస్తామని కూడా హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంతో తదుపరి కార్యాచరణపై రెడ్డి సంఘాల నాయకులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో 8వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'చలో ఇందిరాపార్క్' ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దృష్టిలో ఉంచుకుని ధర్నా కార్యక్రమం వాయిదాకు సంఘ సభ్యులు, రెడ్డి కుటుంబ సభ్యులు, సమాజ పెద్దలు సహకరించాలని రెడ్డి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా తదుపరి చర్యలను పరిశీలిస్తూ, రెడ్డి సమాజ సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏనుగు సంతోష్ రెడ్డి, బద్దురి వెంకటేశ్వర్ రెడ్డి, కొలను వెంకటేశ్వర్ రెడ్డి, బట్టంగారి మాధవ రెడ్డి, అప్పంగారి రామ్ రెడ్డి, పిట్టా శ్రీనివాస్ రెడ్డి, గోపి జైపాల్ రెడ్డి, నగర్తి చంద్రా రెడ్డి,పైళ్ళ హరినాద్ రెడ్డి,నల్ల సంజీవ రెడ్డి,సం రెడ్డి భుజంగా రెడ్డి,నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, కొట్టం మధుసూదన్ రెడ్డి, నిరుడు దయాకర్ రెడ్డి, ఎలిమినేటి సుమన్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, లింగా రెడ్డి,వాకిటి నర్సింహారెడ్డి, మహేందర్ రెడ్డి,రెడ్డి గర్జన పత్రిక ఎడిటర్ గుర్రం పాపిరెడ్డి,వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రకాంత్‌కు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం

సికింద్రాబాద్:సెప్టెంబర్5 : ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా, శనివారం రోజు అబిడ్స్ లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సభలో, బన్సీలాల్ పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న యం.చంద్రకాంత్, ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య చేతుల మీదుగా అందుకున్నారు.

# భావిభారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకభూమిక

**డ్రగ్స్‌లాంటి భూతాల నుంచి కాపాడే బాధ్యత తీసుకోవాలి**

**ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపు**

**జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

**హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు**



సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులు... మారుతున్న కాలంలో చెడు పోకడల నుంచి సన్మార్గం వైపు నడిపించటంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శేరిగూడ సమీపంలోని శ్రీఇందూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించిన ఆయన.... ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఎంతటి అత్యున్నత స్థాయిలో ఉన్న వారి వెనకైనా ఒక ఉపాధ్యాయుడు ఉంటారని మల్‌రెడ్డి చెప్పారు. సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించేందుకు అహర్నిశలు శ్రమించే ఉపాధ్యాయులు... మారుతున్న పరిస్థితుల దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. యువతను పక్కదోవ పట్టిస్తున్న డ్రగ్స్‌లాంటి వాటి పట్ల పోలీసులే కాకుండా ఉపాధ్యాయులు సైతం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థుల భవితకు బంగారుబాటలు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఏసీఎల్బీ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు, సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కోదండరాంకు జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్: తెలంగాణ జేఏసీ చైర్మన్, తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం జన్మదినం సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్వాల్ జేఏసీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గురుకుల జేఏసీ చైర్మన్ మామిడి నారాయణలు కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఎంతో కీలకమైందన్నారు. ఉద్యమ సమయంలో ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలపై కోదండరాం నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషి మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కోదండరాం ఆయురారోగ్యాలతో, సంపూర్ణ సంతోషంతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని వారు కోరుకున్నారు. కోదండరాం జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో అల్వాల్ జేఏసీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గురుకుల జేఏసీ చైర్మన్ మామిడి నారాయణ తదితరులు ఉన్నారు.

## గొల్లపెల్లి, బొప్పాపూర్‌లో ఆదివారం విద్యుత్ అంతరాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపెల్లి, బొప్పాపూర్ గ్రామాల విద్యుత్ వినియోగదారులు, గ్రామ ప్రజలకు విద్యుత్ శాఖ అధికారులు ముఖ్య సమాచారం తెలియజేశారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గొల్లపెల్లి, బొప్పాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎల్లారెడ్డిపేట ఏఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, గ్రామ ప్రజలు ఈ అంతరాయాన్ని గమనించి శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## పోలేపల్లిలో ఉచిత రొమ్ము క్యాన్సర్ల పరీక్ష నిర్వహణ

అరుణ ప్రభ, దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 5 ,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని చందంపేట మండలంలోని పోలేపల్లి లో శనివారం దేవరకొండ బి ఆర్ ఎస్



నియోజకవర్గ నాయకులు వర్త్య రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్ప్ క్యాంప్ ను ఏర్పాటు చేశారు.చందంపేట మండలం పి ఎస్ సి ఎస్ చైర్మన్ జా లే నరసింహారెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చందంపేట మాజీ ఎంపీపీ లోకసాని తిరుపతయ్య , చందంపేట మండలం మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, పోలేపల్లి సర్పంచి శ్రీను, పార్వతి దేవి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు హరీష్ వంగల, హెల్పింగ్ అండ్ అధ్యక్షులు ఆర్కే, ఈ సందర్భంగా అతిథులను వర్త్య రమేష్ నాయక్ శాలువాతో సత్కరించారు.

# నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ఘన సన్మానం**

**విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన వేడుకలు**



నాగారం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగారంలోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల అంకితభావం, కృషి, సేవలను గుర్తిస్తూ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు విద్యార్థులు ఉత్సాహభరితమైన సాంస్కృతిక కార్యక్ర ్మాలను ప్రదర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సంద ర్భంగా పేర్కొన్నారు. ప్రతిరోజూ విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ, వారి లక్ష్యసాధనకు మార్గనిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకకు సికింద్రాబాద్ జోన్ ఏజీఎం శ్రీ పురుషోత్తం రెడ్డి, క్యాంపస్ కోఆర్డినేటర్ శ్రీమతి దీప్తి, ప్రిన్సిపాల్ శ్రీమతి శోభా రెడ్డి, ఏవో మనోజ్ తదితరులు హాజరై ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి ప్రోత్సాహం, సహకారంతో కార్యక్రమం మరింత ఉత్సాహ భరితంగా సాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి వారి సేవలను అభినంది ంచారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. పాటలు, నృత్యాలు, ప్రసంగాలు తదితర కార్యక్రమాలతో విద్యార్థులు తమ ఉపాధ్యా యుల పట్ల ఉన్న గౌరవం, కృతజ్ఞతను చాటుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించే ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. కృతజ్ఞత, ఆనందం, అభినందనలతో నిండిన ఈ వేడుక పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పింది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# ఉద్యోగాల వేట కాదు.. ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

**సివిల్స్, గ్రూప్స్‌తో పాటు హార్టీ-ప్రెన్యూర్‌షిప్ వైపు అడుగులు వేయాలి**

**ఉపాధ్యాయులు సమాజ మార్పునకు దిక్సూచిలు**

**: ఉప కులపతి డా. దండ రాజి రెడ్డి**



గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉప కులపతి డా. దండ రాజి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఉప కులపతి మాట్లాడుతూ తెలంగాణ నిర్మాణంలోనూ, ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్దడంలోనూ ఉపాధ్యాయులు, విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో గురువులు దిక్సూచిలా నిలుస్తారని కొనియాడారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ఉచిత శిక్షణా కార్యక్రమాల ద్వారా ఎంతో మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ఉద్యోగాలు వెతకడం కాదు.. అవకాశాలు సృష్టించాలి విద్యార్థులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే తమ లక్ష్యాలను పరిమితం చేసుకోకుండా ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకోవాలని డా. దండ రాజి రెడ్డి సూచించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసెస్, రాష్ట్రస్థాయి గ్రూప్స్ ఉద్యోగాలకు సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఉద్యానవన రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకుని సరికొత్త ఆవిష్కరణలు, వ్యాపార ఆలోచనలతో 'హార్టీ-ప్రెన్యూర్‌షిప్' వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా విద్యార్థులు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, విస్తరణ విభాగం సంచాలకులు డా. టి. సురేష్ కుమార్, పరిశోధనా విభాగం సంచాలకులు డా. డి. లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. ఎన్. శ్రీనివాసన్, ఆఫీసర్ ఇన్‌చార్జి డా. డి. విజయ, ప్రొఫెసర్ ఎం. రాజశేఖర్, ప్రణాళిక మరియు పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ డా. డి. అనిత కుమారి, డా. వి. సుచిత్ర, డా. వీణా జోషి, పరిపాలనా అధికారి ఆర్. తులసి రాణి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డా. జగదిశ్వర్ కందుల కు బెస్ట్ టీచర్ అవార్డు-2026

హైదరాబాద్(అరుణ ప్రభ)(సెప్టెంబర్ 5) గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ, హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జగదిశ్వర్ కందులకు "బెస్ట్ టీచర్ అవార్డు--2026" లభించింది. ఈ అవార్డును గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొ. డి.ఎస్. రావు, డైరెక్టర్ ప్రొ. రమేష్, మెకానికల్ ఇంజినీరింగ్ ఎచ్ ఓ డి డా. జయప్రకాశ్ ఎస్.వి. చేతుల మీదుగా అందజేశారు.బోధన, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి, మెంటరింగ్ మరియు అకడమిక్ సేవల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డా. జగదిశ్వర్ కందుల మాట్లాడుతూ, "ఈ అవార్డును నా అమ్మ--నాన్నలకు అంకితం చేస్తున్నాను. భవిష్యత్ ఇంజినీర్లను తీర్చిదిద్దేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు.

# గురువే విద్యార్థి భవిష్యత్‌కు మార్గదర్శి



**కాకతీయ విద్యానికేతన్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

ధర్మవరం, సెప్టెంబర్ 5 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి జీవితానికి గురువే తొలి మార్గదర్శి అని, విద్యాబోధనతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతను అలవర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో గురువుల కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. గురువులను గౌరవించడం, వారి సేవలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ నిర్వాసితుల పరిస్థితి అత్యంత దయనీయం

## నమ్మించి నట్టేట ముంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం

## అండగా ఉంటానని హామీ ఇచ్చి చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి

## టీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి



గజ్వేల్ అరుణ ప్రభ : మల్లన్న సాగర్ నిర్వాసితుల జీవితాలు అత్యంత దయనీయంగా మారాయని టీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ శివారులోని ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించి ముంపు బాధితులతో మాట్లాడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవాల్సిన అప్పటి ప్రభుత్వం, అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని యాదగిరి ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి వివిధ హామీలు ఇచ్చి నిర్వాసితులను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. అయితే తమకు అండగా ఉంటానని హామీ ఇచ్చిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్వాసితుల సమస్యలను గుర్తుచేసి, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయించే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చిన నేపథ్యంలో కొండపాక, తొగుట మండలాల పరిధిలోని ఏడు పంచాయతీలు, ఆరు ఆవాస గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించారని తెలిపారు. నిర్వాసితులను అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా తరలించి పునరావాసం కల్పించారని, అయితే ఆర్అండ్ఆర్ కాలనీల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్థిరమైన ఉపాధి లేక నిర్వాసిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయని యాదగిరి అన్నారు. ముఖ్యంగా మల్లన్న సాగర్‌లో చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించకపోవడం, జీవనోపాధి లేకపోవడం, బ్యాంకర్లు రుణాలు ఇవ్వడానికి ముందుకు రాకపోవడం వంటి సమస్యలు వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. వివిధ రకాల హామీలు ఇచ్చి, పరిహారం చెల్లింపుతో పాటు వర్గల్ పారిశ్రామికవాడలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిర్వాసితులకు కేవలం ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాకుండా గౌరవప్రదమైన జీవితం, స్థిరమైన ఉపాధి, ఆదాయ వనరులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీల్లో భాగంగా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో చేపల పెంపకం చేపట్టి నిర్వాసితులకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని, ప్రజా దర్బార్ నిర్వహించి నిర్వాసితుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బాధిత గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యాదగిరి హెచ్చరించారు. సర్వం కోల్పోయిన నిర్వాసితుల ఆగ్రహానికి గురికాకముందే బీఆర్ఎస్ నేతలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, పట్టణ యువజన అధ్యక్షుడు కూరాకుల శ్రీకాంత్, లింగని రాజు, నాంపల్లి, నరేష్ చారీ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై అసెంబ్లీలో కేసీఆర్ జవాబు చెప్పాలి

## ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌లో రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడివి?

## కేసీఆర్ తీరుతో కుంటుపడిన గజ్వేల్ అభివృద్ధి కాళేశ్వరం

## అవినీతిపై సమాధానం చెప్పాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి




గజ్వేల్ అరుణ ప్రభ : కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రావడం ఇష్టం లేకపోతే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని సాధించినప్పటికీ, ప్రస్తుతం బీఆర్ఎస్ వద్ద రూ.1,000 కోట్ల మేర నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో జరిగే చర్చకు కేసీఆర్ హాజరై వాస్తవాలను వివరించాలని కోరారు. రాష్ట్రాన్ని సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన తీరుపై కూడా అసెంబ్లీలో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినప్పటికీ కాంట్రాక్టర్లు, ఉద్యోగులకు బకాయిలు పెట్టడం సిగ్గుచేటని వివేక్ వెంకటస్వామి విమర్శించారు. మల్లన్నసాగర్ నిర్మాణంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేసీఆర్ వ్యవహారశైలి కారణంగా గజ్వేల్ అభివృద్ధి కుంటుపడుతోందని మంత్రి ఆరోపించారు. గజ్వేల్ ప్రజలు నమ్మి ఓట్లేసి ఎమ్మెల్యేగా గెలిపించిన కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి నియోజకవర్గ సమస్యలపై మాట్లాడి నిధులు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోని ఇతర ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, గజ్వేల్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధికార పక్షాన్ని ప్రశ్నిస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని, తెలంగాణలో ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ మాత్రం ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. దమ్ము, ధైర్యం ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని, తన హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. అసెంబ్లీకి హాజరుకాకుండా కేవలం అధికారంపై ఆశతో రాజకీయాలు చేయడం సరికాదని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ తన బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ విజయమోహన్, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి, మజీద్ కమిటీ చైర్మన్ మతీన్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు సమీర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుఖేందర్‌రెడ్డి, నాయకులు మోనగారి రాజు, సారిక శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రేగొండ గౌడ్, రాములు గౌడ్, రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్... ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రా!

## నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు పరిష్కరించు

## కేటీఆర్... గత చరిత్ర తెలుసుకొని మాట్లాడు

## సోనియా తెలంగాణ ఇవ్వకుంటే మీ గతి ఏమిటి?

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నేత వి.హనుమంతరావు



గజ్వేల్ అరుణ ప్రభ : కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌ను వీడి అసెంబ్లీకి వచ్చి, తనను నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నేత వి. హనుమంతరావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని హనుమంతరావు అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో పోరాడి నిధులు సాధించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన మాజీ సీఎం కేసీఆర్ దర్శనం కష్టంగా మారిందని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ముఖం చాటేస్తే ప్రజలు ఊరుకోరని అన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేసే ముందు కేటీఆర్ గత చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో సోనియా గాంధీని దేవతగా అభివర్ణించిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకుంటే కేసీఆర్ కుటుంబం రాజకీయ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడు, కేసీఆర్ వంటి నేతలకు కాంగ్రెస్ రాజకీయంగా అవకాశం కల్పించిందని హనుమంతరావు పేర్కొన్నారు. రాజకీయ పరిణతి సాధించని కేటీఆర్ తన పద్ధతి, వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో సానుకూల స్పందన ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు చేస్తూ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అయితే రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను అడ్డుకోవడం సరికాదన్నారు. కేంద్రం నుంచి నిధులు సాధించాల్సిన బీజేపీ నేతలు ఆ దిశగా కృషి చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో దీక్షలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. అయోధ్య రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పోషించిన పాత్రను ఎవరూ చెరిపేయలేరని హనుమంతరావు అన్నారు. రాష్ట్రంలో మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి, నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, మండలాల బాధ్యులు సుఖేందర్‌రెడ్డి, అశోక్, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు మతీన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా కే.వెంకటరెడ్డికి అవార్డు



ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్, అరుణ ప్రభ (సెప్టెంబర్ -5) తొర్రూరు లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.వెంకటరెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానో పాధ్యాయుడిగా ఎంపికై ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, ఉత్తమ విద్యా ప్రమాణాల అమలు, విద్యార్థుల్లో క్రమశిక్షణ మరియు సహపాఠ్య కార్యక్రమాల ప్రోత్సాహంతో పాటు పాఠశాల సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కే.వెంకటరెడ్డి కి జిల్లాస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు లభించడం పట్ల ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదం డ్రులు, పూర్వ విద్యార్థులు మరియు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినం దనలు తెలిపారు. ఈ సందర్భంగా కే. వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ మధ్య కాలములో రాష్ట్ర స్థాయిలో జరిగిన ప్రధానోపాధ్యాయుల శిక్షణా కార్యక్రమములో "కృత్రిమ మేధస్సు" పైన ఎస్ ఆర్ పి గా పలు అంశాలను చర్చించడం జరిగింది. "ఉత్తమ విద్య -- ఉత్తమ భవిష్యత్తు" అనే లక్ష్యంతో పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.




# దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసాధనంలో ఉపాధ్యాయ దినోత్సవం

శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాజీ రాష్ట్రపతి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం దేవరకొండ యందు వారి చిత్రపటానికి పూల మాల అలంకరించి నివాళులు అర్పించినారు. అనంతరం అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు నరసింహ రెడ్డి మరియు కొండభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీమతి ప్రభావతిలను పూలమాలతో, శాలువ కప్పి మొమంటో అందజేసి వారి సేవలను కొనియాడినారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ మమ్మలను సన్మానిం చినందులకు ధాన్యవాదములు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య,జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఇజాక్, పడమటి శాంతకుమారి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, తాడిశెట్టి సుదర్శన్, నందులాల్, మోటమర్రి పురుషోత్తం, రాములు చెన్నయ్య,కార్యవర్గం సభ్యులు, సభ్యులు 30 మంది పాలుగొన్నారు.

# దిండిలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

.అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 5,శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని దిండి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణుని జన్మ వేడుకలను నిర్వహించే, శనివారం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో యాదవ సోదరులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు హనుమాండ్ల కేశవులు, స్థానిక సర్పంచ్ నల్లగంతుల రవి ,ఏటి కృష్ణ, గాదె కుమారస్వామి ,కాసం రామస్వామి, పున్న లింగమయ్య ,మాధవ గౌడ్, శివాజీ, వంగాల శేఖర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, తుమ్మల మాధవరెడ్డి, అమృత్, ఎలకుర్తి జైపాల్ ,శ్రీనివాస చారి, గ్రామస్తులు, మహిళలు ,పెద్ద సంఖ్యలో హాజరైనారు.




# విజ్ఞాన్ హైస్కూల్‌లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

## కృష్ణుడు గోపికల వేషధారణలో విద్యార్థులు



అరుణ ప్రభ ఇబ్రహీంపట్నం: ఇబ్రహీం పట్నం విజ్ఞాన్ హైస్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో విద్యార్థుల వేషధారణ ఆకట్టుకున్నది. విద్యార్థుల యొక్క రూపాలు అద్భుతంగా ఉన్నాయి. విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపల్ రుద్రాణి మాట్లాడుతూ విద్యార్థులు రేపు భావితరాలకు నాయకులు కావాలని అదేవిధంగా ధర్మం వైపు నడవాలి అధర్మం వైపు అడుగులు వేయొద్దు సత్యాన్ని ఆచరించాలి అన్యాయం అరికట్టాలి న్యాయంతో అనేక విషయాలు ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. తదనంతరం ఉట్టి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల చేత ఉట్టిని కొట్టించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంత ఉత్సాహంగ పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో భ్రమరాంబ రాజశేఖర్ లింగస్వామి ఫరీదా, అక్షరాని, ఊహ, రజిత పాతిమా, జ్యోతి, మమత, అనుష, రోజా,జ్యోతి, రజిత, సుమలత, శ్రీలత, లీల, పాల్గొన్నారు..




# కందుకూరులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

అరుణ ప్రభ ,దిండి, సెప్టెంబర్ 5,భారత స్వర్గీయ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకునే వేడుకలలో భాగంగా దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని, దిండి మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. కందుకూరు గ్రామంలోని వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడల అభివృద్ధికై క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో సుమారు లక్ష రూపాయల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ ఫౌండర్ శ్రీరామదాసు శ్రీను మాట్లాడుతూ, విద్యాభివృద్ధి తో పాటు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు భాగంగా ఈ క్రీడా దుస్తుల అందజేస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు క్రీడలు క్రమ శిక్షణ పాటించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఇంచార్జ్ హెడ్మాస్టర్ కొమిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురు శిష్య పరంపరకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. పాఠశాల శ్రేయోభిలాషి పూర్వ విద్యార్థి వానం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యుత్ తో పాటు మంచి విలువలను అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై, తల్లిదండ్రులపై, సమాజంపై ఉందని గుర్తు చేశారు. కందుకూరి సర్పంచ్ బరపటి కొండలు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదువుకోవాలని విద్యార్థు లకు సూచించారు . ఫౌండేషన్ సభ్యులు గంగిడి రవీందర్ రెడ్డి ,శ్రీరామదాసు నాగరాజు, రమేష్, నాగేంద్రమ్మ, శంకర్, నాగరాజు,,.లింగం యాదవ్, ఎలమంద నాయుడు, నరేష్, వెంకటయ్య పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన కాంగ్రెస్ సర్కార్

**పీర్జాదిగూడలో బీఆర్ఎస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలి**

**జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి**

**మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



సెప్టెంబర్05, అరుణ ప్రభ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ సమస్యలను గాలికొదిలేసిందని ఆరోపిస్తూ మేడ్చల్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి నాయకత్వంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో విద్యారంగం పూర్తిగా కుదేలైందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే విద్యా సమస్యలను పరిష్కరిస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్, పాలన మొదలై ఇన్ని రోజులవుతున్నా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు కాలేజీల్లో సర్టిఫికెట్లు అందక, తల్లిదండ్రులు ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ సర్కార్ చెలగాటమాడటం తగదని హెచ్చరించారు. తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోతే, రాబోయే రోజుల్లో విద్యార్థి లోకంతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, జగన్ రెడ్డి, వీరమళ్ళ జగన్నాధం, శశిధర్ రెడ్డి, అశోక్, సతీష్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, సోమేశ్, అక్షిత్, వెంకట్, నారాయణ రెడ్డి, అమర్ పటేల్, తిరుమలేష్, మధు,జమీర్, కిరణ్ గౌడ్, వారికల శ్రీనివాస్, చిరంజీవి, రమేష్, కైసర్, అనిల్, శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన
## మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి

సెప్టెంబర్ 5,అరుణ ప్రభ. : ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులందరినీ పూలబొకేలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను అందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు వారి వేతనాలను ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ సమక్షంలో వాలంటీర్లకు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి వేతనాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, మధు, కృష్ణయ్య, నర్సింహులు, శివరాజు, కళ్యాణ్, కృష్ణస్వామి, పాండు, ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10 వేలు ఎక్కడ..?**

**స్కూటీలు ఎక్కడ..? తులం బంగారం ఎక్కడ..?**

**రాష్ట్రంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నువ్వేనా..?**

**బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**




అరుణప్రభ, ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 3000 మంది విద్యార్థిని, విద్యార్థులతో కలిసి ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై బీఆర్ఎస్వీ నియోజకవర్గం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఈ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తామని, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీలు ఇచ్చారని, కానీ వాటి అమలు ఏమైందని ప్రశ్నించారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదు. ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో మహిళలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. "రాష్ట్రంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారు..? విద్యార్థుల సమస్యలను పట్టించుకునే వారే లేరా..?" అంటూ ప్రభుత్వంపై ప్రశాంత్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో మాజీ జిల్లా చైర్మన్ సత్తు వెంకట్ రమణ రెడ్డి, యువజన నియోజకవర్గం అధ్యక్షులు జెర్కొని రాజు, బీఆర్ఎస్వీ నాయకులు రాజ్ కుమార్, మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి, అబోతు ప్రవీణ్ నాయక్, బద్రీనాథ్, నూతనగంటి శేఖర్, గణేష్, వీరేష్, మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, మండల అధ్యక్షులు రమేష్ గౌడ్, చీరాల రమేష్, పి. కృపేష్ భాస్కర్, శ్వేత బాలు, కొంద్రు ప్రవీణ్, సుల్తాన్, తీర్మల్ రెడ్డి, శివ, నాయకులు, బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనిర్వచనీయం పూర్వ విద్యార్థుల గురుపూజోత్సవ వేడుకలు

**గురుపూజోత్సవ వేళ తన గురువును**
**సన్మానించిన 1973 -74 సంవత్సర పూర్వ విద్యార్థులు**





అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ సుంకరి శంకరయ్య సార్ కు వారి శిష్య బృందం 1973-74 ఎస్ఎస్సి బ్యాచ్ ఆధ్వర్యంలో ఘనమైన సన్మానం స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జడ్పీహెచ్ఎస్ కంకర్ బోర్డ్ పాఠశాలకు చెందిన 1973 -74 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు వారి గురువర్యులు నాటి ప్రధానోపాధ్యాయులు శ్రీ సుంకరి శంకరయ్య గారికి ఘనమైన సన్మానం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్య నారాయణ గౌరవ అతిధిగా నలంద విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీమతి డోలి సాధన హాజరయ్యారు ప్రిన్సిపల్ వై కృష్ణ ప్రసాద్ అధ్య(క్షతన జరిగిన సమావేశంలో కార్యక్రమంలో భాగంగా ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రప టానికి పూల మాలార్పణ చేశారు అనంతరం గురువర్యులు సుంకర శంకరయ్య వారి శిష్యులు జి శ్యామ్మోహన్ ఎం శేష కుమార చారి ఎం వెంకటాచారి ఎండి షాబుద్దీన్ టి మధు ఎండి రహీం ఎండి ముజఫర్ అహ్మద్ ఎస్ సంపత్ ఎండి జాఫర్ ఖాన్ డి తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ ఆ గురువుగారు సుంకర శంకరయ్య సార్ ఆ రోజు మాకు నేర్పించిన క్రమశిక్షణ విద్యా విజ్ఞానం మమ్మల్ని ఎంతో ప్రయోజకుల్ని చేసింది మేము సార్ ని ఆదర్శంగా తీసుకోవడం తీసుకోవడం ద్వారా మాకు ప్రభుత్వం ఉద్యోగాలు బ్యాంకు ఉద్యోగాలు ఉపాధ్యాయ ఉద్యోగాలు అనేకమైన గుర్తింపు గల పదవులను పొందాము అనుభవించాం ఇదంతా మేము గర్వించదగ్గ విషయం మా గురువుగారు మా జీవితంలో వెలుగు నింపారు మేం సదా సార్ ని గుర్తుంచుకుంటాం అని పేర్కొంటూ పాఠశాలలో జరిగిన సన్నివేశాలను నెమరు వేశారు డోలి సత్యనారాయణ గారు మాట్లాడుతూ గురుశిష్యుల బంధం చాలా పవిత్రమైనది ఎన్నో మంచి విషయాలు గురువుల బోధిస్తారు వాటిని ఆచరించి ప్రయోజకులు కావలసిన బాధ్యత శిష్యులపై ఉందని పేర్కొన్నారు సన్మాన గ్రహీత గౌరవనీయులు శ్రీ సుంకరి శంకరయ్య గారు మాట్లాడుతూ నేను 40 సంవత్సరాలు ఉపాధ్యాయునికి పనిచేసే అనేకమందికి విద్యా సేవలు అందించాను ఈరోజు నా విద్యార్థులు ప్రయోజకులై నన్ను ఇంత ఘనంగా సన్మానించడం నాకు చాలా సంతోషంగా ఉంది ఉపాధ్యాయుడు తన విద్యార్థుల ప్రయోజకులైనప్పుడు వచ్చే సంతృప్తి లెక్కల్లో చెప్పలేని విషయం మీరంతా నన్ను కలవటం చాలా ఆనందకరంగా ఉందని పేర్కొన్నారు కార్యక్రమంలో నలంద విద్యాసంస్థలు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



## ఉపాధ్యాయులకు లైన్స్ క్లబ్ ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5 (అరుణప్రభ): ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లైన్స్ క్లబ్ ఆఫ్ ఎల్లారెడ్డిపేట ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ధర్పల్లి శ్రీనివాస్, బండి బలరాం, భారతం శ్రీకాంత్, పాలోజీ నారాయణ, జీడి రవీందర్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పోషిస్తున్న పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బోయిని మహదేవ్, సెక్రటరీ గుర్రాల రాజిరెడ్డి, ట్రెజరర్ వంగ శ్రీకాంత్ రెడ్డి, జోనల్ చైర్పర్సన్ రామచంద్రం, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, నాయిని భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే లైన్స్ క్లబ్ సభ్యులు చిర్రం నాగరాజు యాదవ్, ముత్యం రెడ్డి, బండారపు లక్ష్మారెడ్డి, పల్లి సాంబశివరావు, రాగుల మల్లారెడ్డి, రావుల లింగారెడ్డి, కొలనూరు శంకర్, గొల్లపల్లి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్ ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్ట్
## మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ సీఐ ఎన్ అంజలి



అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రేమ పేరుతో ప్రేమిస్తున్నానని నమ్మించి తనను మోసం చేసి వేరే ఒక అమ్మాయిని పెళ్లి చేసుకునీ ప్రేమించిన అమ్మాయి చావుకి కారణమైన కేసులో నిందితుడైన తేజవత్ శ్యామ్, తండ్రి జామ్లా, 28 సం,,లు, వృత్తి: వార్డ్ ఆఫీసర్, మహబూబాబాద్ మున్సిపాలిటీ, గ్రామం రేకులతండా, సీరోల్ మండలం అనే వ్యక్తిని మహబూబాబాద్ టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు కేసు వివరాలను పరిశీలించగా నిందితుడైన శ్యామ్ మృతురాలిని ప్రేమిస్తున్నాను అని చెప్పి పెళ్లిచేసుకోకుండా మోసంచేసి మరో మహిళను వివాహం చేసుకోవడం వల్ల మృతురాలు మనస్థాపానికి గురై గత నెల 17వ తేదిన తన ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడిన విషయం విధితమే. ఈ ఘటన జరిగినప్పటి నుండి నిందితుడు పరారీలో ఉండగా నిందితుడిని త్వరితగతిన పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ శభరిష్. పి. సూచనల మేరకు మహబూబాబాద్ డీఎస్పీ నంబూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రత్యేక బృందాలు నిరంతరం దర్యాప్తు చేపట్టి, అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలు మరియు ఇతర సమాచారాన్ని విశ్లేషించి ఈ రోజు ఉదయం నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ సీఐ ఎన్ అంజలి తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన టౌన్ సీఐ ఎన్ .అంజలి, సీసీఎస్ సీఐ బి .హతిరామ్, కురవి ఎస్ ఐ బి సతీష్, సీసీఎస్ ఎస్ ఐ ఎస్ కే .తాహెర్ బాబా, టౌన్ ఎస్ ఐ లు గడ్డం ఉమ, యూ .సూరయ్య, హెచ్ సి ఎల్ శ్రీనివాస్ రావు, పీసీలు గౌతమ్, శ్రీకాంత్, లక్ష్మణ్, నరేష్ మరియు ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ మరియు డీఎస్పీ అభినందించారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ వారు ప్రశంసించారు.





## గురువులను సన్మానించిన
## సంపత్‌రావు- స్వర్ణ దంపతులు

అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 5,,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండల కేంద్రంలోని ఆల్ఫా మోడల్ స్కూల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ,శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఎడ్లపల్లి సంపత్ రావు స్వర్ణ దంపతులు (సర్పంచ్ సర్వారెడ్డిపల్లి )పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు .అదేవిధంగా శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేష ధారణతో పుట్లు కొట్టడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారత మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత మొదటి గురువు ఉపాధ్యాయులని ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని విద్యార్థులు గ్రహించుకొని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక షిరిడి సాయిబాబా ఆలయ ట్రస్టు కమిటీ అధ్యక్షులు పానుగంటి లక్ష్మీనరసింహ, ఉపాధ్యాయ బృందం ముడి లింగమయ్య ,సినీ ,భార్గవి, మహాజన, సంధ్య, లక్ష్మీ, సంధ్యా మరియు తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మంచి స్థానాల్లో నిలబడి, సమాజానికి మరియు దేశానికి సేవ చేయడం ప్రతి ఉపాధ్యాయుడికీ ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. శిష్యుడు తన గురువును మించిన స్థాయికి ఎదిగినప్పుడు ఏ గురువైనా ఎంతో సంతోషిస్తారు" అని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలోని ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించి, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవం, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల




వైస్ ప్రిన్సిపల్ ఎస్. కిరణ్మయి, కోఆర్డినేటర్ డాక్టర్ బి. యశోద, అధ్యాపకులు డాక్టర్ కె. లావణ్య, డాక్టర్ జి. సురేంద్ర, డాక్టర్ వెంకట ప్రసాద్, రమణారెడ్డి, బి. శ్రీనివాసులు, కృపా కరణవాణి, శైలజ, ఎన్. వసంత, అమ్మాజీ, హేమబిందు, బుజ్జెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అప్పు విషయంలో కుల దూషణలు.. మహిళ ఆత్మహత్యాయత్నం

**ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించిన బీజేపీ, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు**

ధర్మవరం, సెప్టెంబర్ 5 (అరుణ ప్రభ): ధర్మవరం పట్టణంలోని ఎల్–2 ప్రాంతానికి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళ అప్పు విషయంలో కులం పేరుతో దూషణలకు గురై మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బీజేపీ, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాయకుల వివరాల ప్రకారం.. ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరమ్మ అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకున్నారు. నాలుగు నెలల్లో అప్పు తీర్చుతానని ఆమె చెప్పడంతో సదరు వ్యక్తి కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో తిట్టినట్లు వారు ఆరోపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఈశ్వరమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆసుపత్రికి వెళ్లి ఈశ్వరమ్మను పరామర్శించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# నేతన్న పిలుపు మేరకు కేటీఆర్ రాక

**ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గం ఆవిష్కరణ**

**'వెండి వెన్నెల' చీరను ఆవిష్కరించిన కేటీఆర్**

**నేతన్న విజయ్ ప్రయత్నాలకు అభినందనలు..**

**బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే కర్మాగారం ఏర్పాటు చేస్తామని హామీ**





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : చేనేత రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ కొత్త తరహా హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని రూపొందించిన సిరిసిల్ల నేతన్న నల్లా విజయ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. విజయ్ ఆహ్వానం మేరకు సిరిసిల్లలోని ఆయన నివాసానికి వచ్చిన కేటీఆర్.. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన నూతన హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని పరిశీలించి ఆవిష్కరించారు. అదే మగ్గంపై రూపొందించిన ప్రత్యేకమైన 'వెండి వెన్నెల' చీరను కూడా కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సిరిసిల్లకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు నల్లా పరంధాములు ఒకప్పుడు అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసి ప్రపంచవ్యాప్తంగా సిరిసిల్ల చేనేత కళకు గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కుమారుడు నల్లా విజయ్ ఆధునిక సాంకేతికతను చేనేత కళతో మేళవిస్తూ అనేక వినూత్న ప్రయోగాలు చేస్తున్నారని ప్రశంసించారు. 'షిఫ్ట్ జాకార్డ్' వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ వెండి, బంగారంతో ప్రత్యేకమైన చీరలను రూపొందించడం అభినందనీయమన్నారు. విజయ్ రూపొందించిన 'వెండి వెన్నెల' చీర అద్భుతంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. విజయ్ చేస్తున్న ప్రయోగాలను ప్రత్యక్షంగా చూసి అభినందించాలనే ఉద్దేశంతో ఆయన ఆహ్వానం మేరకు వచ్చానని తెలిపారు. విజయ్ ప్రతిభను అభినందించిన కేటీఆర్.. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విజయ్ కోసం సిరిసిల్లలో అద్భుతమైన కర్మాగారం ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సబ్సిడీలు అందించి, ఈ సాంకేతికతను మరింత మంది నేతన్నలు అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సిరిసిల్లను కేవలం పవర్‌లూమ్ పరిశ్రమకే పరిమితం చేయకుండా ఆధునిక సాంకేతికతతో కూడిన హ్యాండ్‌లూమ్ చేనేతకు కూడా ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విజయ్ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని కేటీఆర్ అన్నారు.

**నేతన్నలకు శ్రమ తగ్గుతుంది**

ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో మగ్గంపై పని వేగం పెరగడంతో పాటు నేతన్నల శ్రమ గణనీయంగా తగ్గుతుందని నల్లా విజయ్ తెలిపారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. ఆధునిక సాంకేతికతతో రూపొందిస్తున్న ప్రత్యేకమైన చీరలకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, తద్వారా నేతన్నలకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడంలో కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారని విజయ్ తెలిపారు. గతంలో తాము రూపొందించిన వినూత్న చీరలను కూడా కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించామని గుర్తుచేశారు. ఈసారి ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ మగ్గంతో పాటు దానిపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని విజయ్ పేర్కొన్నారు.

# కేజీబీవీలో షేర్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ (జెఆర్సి) ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'షేర్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ (జెఆర్సి) విభాగం అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్సి) మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ నాగవాని మాట్లాడుతూ..సమాజంలో పేరుకుపోయిన సామాజిక అసమానతలు, అనాచారాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కేవలం పుస్తకాల్లోని చదువునే కాకుండా, పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. సమాజంలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో గురువుల పాత్ర ఎనలేనిదని స్పష్టం చేశారు. ఈ సందర్బంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల ఉపాధ్యాయులందరినీ శాలువాలతో సత్కరించారు. అనంతరం షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి విద్యార్థినులకు 'బాల్య వివాహ రహిత భారత్' అంశంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నప్పుడు లేదా బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 181 (మహిళా హెల్ప్‌లైన్) నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ న్యాయవాది చెన్న మల్లా రెడ్డి, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సెల్ రాజకృష్ణ లు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు ఆ జీవితానికి ఒక సార్థకతను, మార్గాన్ని చూపిస్తారని హితవు పలికారు. గురువులను గౌరవించడం ద్వారానే విద్యార్థులు ఉన్నతమైన సంస్కారాన్ని అలవర్చుకోగలరని అన్నారు మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన సామాజిక అసమానతలు, అనాచారాల నిర్మూలనలో అన్నారు. కేవలం పుస్తకాల్లోని చదువునే కాకుండా, పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే




శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. సమాజంలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో గురువుల పాత్ర ఎనలేనిదని స్పష్టం చేశారు. ఈ సందర్బంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల ఉపాధ్యాయులందరినీ శాలువాలతో సత్కరించారు. బాధితులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు ఉచిత న్యాయ సలహా మరియు సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవలెనని కోరారు . ఈ కార్యక్రమం లో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి భవాని 'సఖి' నుండి షాజన్,లవన్య , షేర్ జెఆర్సి కమ్యూనిటీ మొబైలెజర్ రమేష్, సోమన్న,హిమబిందు, ఉమామహేశ్వరి, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): వైయస్సార్ ప్రభుత్వంలో సీఎం సహాయ నిధి ద్వారా ఒక్కరికి కూడా ఎటువంటి సహాయం అందించలేదని ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఏడు కోట్ల రూపాయలకు పైగా గూడూరు నియోజకవర్గంలో సీఎం సహాయని ద్వారా అందించామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ మరియు నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత ఇప్పటివరకు 28 విడతలగా ఏడు కోట్ల కు పైగా సీఎం సహాయ నిధి ఇవ్వడం జరిగిందని పార్టీలకతీతంగా పేదవారందరికీ సహాయం అందిస్తున్నామని నాయకులు కూడా రాజకీయ కక్షలు పెట్టుకొని పేదవాడు వేరే పార్టీ అని ఇబ్బంది పెట్టవద్దని ఎవరైనా సీఎం సహాయ నిధి కొరకు సంప్రదిస్తే వారిని క్యాంప్ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి ,కిరణ్ కుమార్ ,చెంచురామయ్య ,శ్రీనివాసులు ,వెంకటేశ్వరరాజు, రహీం, పెంచలయ్య, సురేంద్ర ,రాజశేఖర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కడివేడు గ్రామ ప్రాథమిక పాఠశాల యందు గూడూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే శివయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాటర్ ఫిల్టర్ అదేవిధంగా నాంచారంపేట ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ లయన్ రవిచంద్ర రెడ్డి దాతృత్వంతో లైన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ ఆదిశేష రెడ్డి చేతుల మీదుగా అందించడమైనది. ఈ సందర్భంగా రీజనల్ చైర్మన్ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ లైన్స్ ఇంటర్నేషనల్ ప్రపంచంలో ఏ విపత్తు జరిగిన తక్షణమే ఆదుకుంటుందని మొన్న జరిగిన నేపాల్ వరదల్లో కూడా 2 లక్షల ,డాలర్లు సహాయం అందించడం జరిగిందని తెలిపారు. అనంతరం లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గూడూరు లయన్స్ క్లబ్ పేద విద్యార్థుల అభివృద్ధికి మరియు పేదల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తుందని తెలిపారు తదుపరి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్ వెంకటేశ్వర్లు డి వెంకట రమణయ్య , శిరీష్ నీ సన్మానించడం జరిగినది .ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ మనుబోలు రూపేష్ రెడ్డి సెక్రెటరీ పప్పు వీరేంద్రనాథ్ ట్రెజరర్ రవిచంద్ర రెడ్డి సీనియర్ సభ్యులు మల్లెమాల మురళి రెడ్డి రామ్మోహన్ రావు, జక్కం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి రామచంద్ర ,కళ్యాణ సాయి, రాధాకృష్ణ ఉపాధ్యాయులు ,పాఠశాల విద్యార్థులు , పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడే విద్యార్థి భవిష్యత్తుకు మార్గదర్శి ::: రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ధర్మవరం: సెప్టెంబర్ 5; (అరుణ ప్రభ న్యూస్): విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని ఎంపీడీవో వెంకటేశు, ఎంఈఓలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, దేశ అత్యున్నత పదవిని అలంకరించి ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణను నేర్పడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వసీం, నాగప్ప, హరిబాబులను బ్రహ్మకుమారి రాధా, ఎంఈఓలు ఘనంగా సన్మానించారు.



## వార్డు సమస్యలపై చిలకం ఆరా

ధర్మవరం, సెప్టెంబర్ 5; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని 28వ వార్డులో ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. మసీదు వద్ద అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు మార్చేలా ఏఈ నాగభూషణ్‌తో మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.



# నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

ధర్మవరం, సెప్టెంబరు 5 (అరుణ ప్రభ న్యూస్): 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా లక్ష్మీ చెన్నకేశవపురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాకతీయ హైస్కూల్‌లో విద్యార్థులకు నేత్రదానం, కంటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆప్టోమెట్రిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ అనురాధ పాల్గొని నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ కుమార్ కంటి ఆరోగ్యం, పోషకాహారం, స్క్రీన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేత్రదానంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆదిశేషు, జయంత్ కుమార్, జయ్ కుమార్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

## వెయ్యి రోజులు కాదు... వెయ్యేండ్లు గుర్తుండేలా ప్రజల గుండెల్లో నిలిచే ప్రజా పాలన కొనసాగిస్తాం

అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల ప్రజా పాలనను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహబూబబాద్ మున్సిపల్ చైర్మన్, గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ముగింపు కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. రైతులు, పేదలు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నటువంటి మహిళలకు ఉచిత బస్సు గానీ రేషన్ కార్డు గాని 500 కు గ్యాస్ గాని మరియు ఇందిరమ్మ ఇండ్లు ఐదు లక్షల రూపాయలతో నిరుపేదలకు అందిస్తుంది అదేవిధంగా డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, 200 యూనిట్ల ఉచిత కరెంటును, మహిళలకు కొత్త పెన్షన్లను అందిస్తున్న ఘనత మరి కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు అదేవిధంగా ఈ యొక్క సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలో బలంగా తీసుకెళ్లాలన్నారు అన్ని మతాలు, అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తూ, హిందూ పండుగలు, సంప్రదాయాలు, ఆలయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వెయ్యి రోజులు కేవలం ఒక మైలురాయి కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన ప్రజా పాలనకు నిదర్శనం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ అధ్యక్షులు, మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ పలు వార్డుల కౌన్సిలర్లు, మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు,





గూడూర్, మండలాల పార్టీ అధ్యక్షులు, మరియు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఎస్టీ సెల్ ,ఎస్సీ సెల్, ఓబీసీ సెల్ ,మైనార్టీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు, మహిళా మణులు పత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు...

# సమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

## మహర్షి విద్యాలయలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక మహర్షి విద్యాలయలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి సుధా అర్జున్ రెడ్డి మరియు డైరెక్టర్ డాక్టర్ సూర్యకుమారి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాలలో 'విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం' నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలను పోషించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల పరిపాలన బాధ్యతలను సైతం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విజయవంతంగా నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీమతి సుధా అర్జున్ రెడ్డి గారు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగి, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని స్పష్టం చేశారు. విద్యాబోధనలో మహర్షి విద్యాలయ ఉపాధ్యాయ బృందం చూపిస్తున్న ప్రతిభను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం డైరెక్టర్ డాక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ.. కేవలం పుస్తకాల్లోని జ్ఞానాన్ని అందించడమే కాకుండా, విద్యార్థుల సత్ప్రవర్తనను మలిచి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు మరియు బహుమతులను అందించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నీటి కొరత తీర్చాలని మహిళల ఖాళీ బిందెల ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ । సెప్టెంబర్ 5 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ మహిళలు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. గత కొంతకాలంగా గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్‌ను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపించారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన చుక్కల భీమయ్య ఇంటి సమీపంలోని బోరు సుమారు రెండు నెలలుగా పనిచేయడం లేదని స్థానికులు తెలిపారు. బోరు మరమ్మతు చేయించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని వారు వాపోయారు. ఈ సమస్యపై గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించి, పనిచేయని బోరును మరమ్మతు చేయించాలని మహిళలు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన తాగునీటిని నిరంతరాయంగా అందించేలా గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనలో



కొండరాజు, ఆల్లె లక్ష్మి, కొండ లక్ష్మి, చుక్కల మల్లవ్వ, చుక్కల యాదమ్మ తదితర గ్రామ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం



## ఎయిర్‌పోర్ట్ ఉద్యోగిని రాధిక దుర్మరణం
## తీవ్ర గాయాలతో స్నేహితుడు ఆస్పత్రికి..
## 8 ఏళ్ల కుమారుడి భవిష్యత్తుపై ఆందోళన

అరుణ ప్రభ, శంషాబాద్ జోన్ : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎయిర్‌పోర్ట్ ఉద్యోగిని రాధిక మృతి చెందింది. డ్యూటీకి వెళ్లేందుకు తన స్నేహితుడి బైక్‌పై ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ క్యాబ్ బైక్‌ను బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న రాధిక తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. బైక్ నడుపుతున్న ఆమె స్నేహితుడికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి కొన్ని సంవత్సరాల క్రితం భర్త రాజశేఖర్‌తో కలిసి రాధిక శంషాబాద్‌కు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌లో ఉద్యోగం చేస్తూ తన ఎనిమిదేళ్ల కుమారుడిని పోషిస్తూ జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. కొంతకాలం క్రితం కుటుంబ విభేదాల కారణంగా భర్త రాజశేఖర్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. అప్పటి నుంచి రాధిక ఒంటరిగా తన కుమారుడిని సాకుతూ, కష్టపడి జీవనం సాగిస్తోంది. అయితే ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడంతో ఆ ఎనిమిదేళ్ల బాలుడి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఆర్జీఐఏ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైనట్లు భావిస్తున్న క్యాబ్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తల్లిని కోల్పోయిన ఆ ఎనిమిదేళ్ల బాలుడి భవిష్యత్తు ఏమిటి..? అతడికి అండగా ఎవరు నిలుస్తారు..? అంటూ స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



# విశ్రాంత ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ధర్మవరం, సెప్టెంబర్ 5; (అరుణ ప్రభ న్యూస్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక లయోలా విద్యా సంస్థలో విశ్రాంత, సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎన్.హెచ్.కె. విజయకుమారి, రంగయ్య, శ్రీనివాసులు, గోవిందప్పలను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, అధ్యక్షులు పి. శంకర్ నాయుడు, కార్యదర్శి గుంటెప్ప, ఉపాధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి చంద్రశేఖర్, అకడమిక్ డైరెక్టర్ బి. రామకృష్ణ, జింకా చిన్నప్ప, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ధర్మవరం, సెప్టెంబర్ 5; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వై. ప్రశాంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత విశేషాలను అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. జస్వంత్ కుమార్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# అత్యంత పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి

## కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పురం భూపాల్ రెడ్డి వైస్ ప్రిన్సిపల్ పురం ప్రీతి రెడ్డి డైరెక్టర్ ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 5 సర్వేపల్లి రాధాకృష్ణ గారి జన్మదిన సందర్భంగా ప్రతి సంవత్సరము కూడా మా పాఠశాలలోని ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సత్కరించుకోవడం జరుగుతుంది. భారతదేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సెప్టెంబర్ 5. 1962లో ఆయన రాష్ట్రపతి అయ్యాక, కొందరు విద్యార్థులు ఆయన పుట్టినరోజును జరుపుకోవాలని కోరగా.. ఆయన స్పందిస్తూ తన ఒక్కరి పుట్టినరోజు జరుపుకోవడం కంటే ఆ రోజును ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా జరపాలని కోరారు. అప్పటి నుండి ఈ రోజును టీచర్స్ డేగా నిర్వహిస్తున్నారు అని ఈ సందర్భంగా మా పాఠశాలల ఉపాధ్యాయ బృందంను సత్కరించు కోవడం ఎంతో సంతోషం గా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయుల బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



# చదువుల తల్లి సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

## మహిళల విద్య కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు
## ఎమ్మార్పీఎస్ ఎన్ఎస్పి జిల్లా నాయకులు ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5 (అరుణప్రభ): చదువుల తల్లి, భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే దంపతుల సేవలను సమాజం ఎప్పటికీ మరువకూడదని ఎమ్మార్పీఎస్ ఎన్ఎస్పి జిల్లా నాయకులు ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే దంపతులు సామాజిక సంఘ సంస్కర్తలుగా సమాజానికి ఎన్నో సేవలు అందించారని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు విద్య అందించేందుకు అనేక పాఠశాలలను ఏర్పాటు చేసి, మహిళలు విద్యావంతులు కావడానికి కృషి చేసిన గొప్ప నాయకురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను నేటి సమాజం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మహనీయుల సేవలను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ వారిని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మునిగే ఎల్లం మాదిగ, ప్రధాన కార్యదర్శి మల్యాల ప్రహ్లాద మాదిగ, తాటిపెల్లి నరసయ్య మాదిగ, ఉపాధ్యక్షులు మునిగ దేవయ్య మాదిగ, మరాఠీ మైసయ్య మాదిగ, కార్యదర్శులు మునిగే నరసింహులు మాదిగ, సిరిసిల్ల దేవయ్య మాదిగ, నరసయ్య మాదిగ, లింగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం మున్సిపల్ ఎన్నికలు.. ప్రజల అజెండా

**ఐదు రోజుల ప్రత్యేక కథనాల సిరీస్**

**ధర్మవరం మున్సిపల్ ఎన్నికలు.. ప్రజల అజెండా**

**నాయకులకే కాదు.. అధికారులకూ బాధ్యత!**

**రిజర్వు స్థలాల పరిరక్షణ ఎక్కడ?**
**డ్రైనేజీకి అడ్డుగా అక్రమ నిర్మాణాలపై చర్యలెక్కడ?**

ధర్మవరం, సెప్టెంబరు 5 (అరుణ ప్రభ న్యూస్): మున్సిపల్ పాలన అంటే కేవలం ఎన్నికలు.. పాలకవర్గం.. సమావేశాలకే పరిమితం కాదు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, మున్సిపల్ ఆస్తులను కాపాడటం, నిబంధనలను అమలు చేయడం, పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం కూడా మున్సిపల్ వ్యవస్థ ప్రధాన బాధ్యతల్లో భాగమే. అయితే ధర్మవరం పట్టణంలో మున్సిపాలిటీ పనితీరుపై ప్రజల నుంచి పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ రిజర్వు స్థలాల పరిరక్షణ, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, అక్రమ నిర్మాణాల నియంత్రణ వంటి అంశాల్లో అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రిజర్వు స్థలాల పరిరక్షణ ఎవరి బాధ్యత?**

పట్టణ ప్రణాళికలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన రిజర్వు స్థలాలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన మున్సిపల్ ఆస్తులు. అలాంటి స్థలాలపై ఆక్రమణలు జరిగితే వాటిని గుర్తించడం, రికార్డులను పరిశీలించడం, ఆక్రమణలను నిరోధించడం, అవసరమైన చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయా? వాటి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? గుర్తించిన ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉన్నాయి.

**డ్రైనేజీకి అడ్డుగా నిర్మాణాలుంటే.. చర్యలు ఎక్కడ?**

పట్టణంలో డ్రైనేజీ సమస్యకు కేవలం కాలువల శుభ్రత ఒక్కటే పరిష్కారం కాదు. కాలువల ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలు, ఆక్రమణలు, అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన పనులు కూడా సమస్యకు కారణమయ్యే అవకాశం ఉంది. అలాంటి నిర్మాణాలు గుర్తించినప్పుడు నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న నిర్మాణాల విషయంలో రాజకీయ, వ్యక్తిగత ఒత్తిళ్లకు అతీతంగా నిబంధనలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**పారిశుధ్యం.. ఫిర్యాదు తర్వాతే స్పందనా?**



డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న భవనం
"డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా భవనం.. నిబంధనల అమలుపై ప్రశ్నలు"

పట్టణ పారిశుధ్యం రోజువారీ నిర్వహణకు సంబంధించిన అంశం. చెత్త సేకరణ, కాలువల శుభ్రత, పారిశుధ్య కార్మికుల పర్యవేక్షణ, చెత్త నిల్వ ప్రాంతాల నిర్వహణ వంటి అంశాల్లో నిరంతర పర్యవేక్షణ అవసరం. ప్రజలు ఫిర్యాదు చేసిన తర్వాత మాత్రమే స్పందించే విధానం కాకుండా.. సమస్య తలెత్తకముందే గుర్తించి పరిష్కరించే వ్యవస్థ ఉండాలి.

**ప్రజాప్రతినిధులు ప్రశ్నించాలి.. అధికారులు అమలు చేయాలి**

మున్సిపల్ పాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర కూడా కీలకమే. ప్రజల సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకురావడం, అవసరమైన నిర్ణయాల కోసం ఒత్తిడి చేయడం, అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కోరడం వారి బాధ్యత. అదే సమయంలో అధికారులు నిబంధనల ప్రకారం నిర్ణయాలను అమలు చేయాలి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే.. వారు ఎవరు అన్నదానికంటే నిబంధన ఏమి చెబుతోంది? అనేది ముఖ్యంగా ఉండాలి.

**ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు**

మున్సిపల్ రిజర్వు స్థలాల వివరాలు ఏమిటి? వాటిలో ఆక్రమణలకు గురైనవి ఎన్ని?

డ్రైనేజీ ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలను గుర్తించారా?

అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?



నెలల తరబడి శుభ్రం చేయని కాలువ : "నెలల తరబడి శుభ్రతకు నోచుకోని కాలువ.. పారిశుధ్య నిర్వహణపై విమర్శలు"

పారిశుధ్యంపై వచ్చిన ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించారు?

ప్రజల పన్నులతో చేపట్టిన పనుల నాణ్యతను ఎవరు పర్యవేక్షిస్తున్నారు?

**ఇవి రాజకీయ ప్రశ్నలు కావు.. ప్రజల హక్కులకు సంబంధించిన ప్రశ్నలు.**

**అరుణ ప్రభ విశ్లేషణ:**

మున్సిపాలిటీ అంటే కేవలం భవనాలు, రోడ్లు, కాలువలు కాదు.. ప్రజల ఆస్తులు, ప్రజల పన్నులు, ప్రజల హక్కులను కాపాడే వ్యవస్థ. పాలకులు ప్రజల సమస్యలను ప్రస్తావించాలి. అధికారులు నిబంధనలను అమలు చేయాలి. ప్రజలు కూడా తమ హక్కులను ప్రశ్నించాలి. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే ధర్మవరం పట్టణ పాలనలో మార్పు సాధ్యమవుతుంది.



కాలువలో పేరుకుపోయిన చెత్త/మురుగు
"పూడిక, చెత్తతో నిండిన కాలువ.. ఇబ్బందులు పడుతున్న స్థానికులు"

**రేపటి కథనంలో..**

**గెలిచేది ఎవరో కాదు.. గెలవాల్సింది ధర్మవరం!**

**ఐదేళ్ల పాలనకు ప్రజల ముందుంచాల్సిన 15 అంశాల అభివృద్ధి అజెండా ఏమిటి?**

**నీటి నుంచి పారిశుధ్యం వరకు.. రోడ్ల నుంచి డ్రైనేజీ వరకు..**
**మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ నుంచి పారదర్శక పాలన వరకు..**
**కొత్త పాలకవర్గం దృష్టి పెట్టాల్సిన 15 కీలక అంశాలపై ద**
**"అరుణ ప్రభ" ప్రజల అజెండాను రేపటి కథనంలో అందిస్తుంది.**

# అప్పుల ఉచ్చు.. ఆత్మహత్యయత్నం!

## పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న అధిక వడ్డీ వ్యాపారులు..

## ధర్మవరంలో అక్రమ ఫైనాన్స్‌పై ప్రత్యేక డ్రైవ్ అవసరం




ధర్మవరం, సెప్టెంబర్ 5; (అరుణ ప్రభ న్యూస్) : అప్పు తీసుకోవడం తప్పు కాదు.. ఆర్థిక అవసరం ప్రతి కుటుంబానికీ ఉంటుంది. కానీ ఆ అవసరాన్ని ఆసరాగా చేసుకుని పేద, మధ్యతరగతి కుటుంబాలను అధిక వడ్డీల పేరుతో అప్పుల ఊబిలోకి నెట్టడం ఆందోళనకర పరిణామం. అప్పు తీర్చేందుకు మరో అప్పు.. వడ్డీ కట్టేందుకు మళ్లీ అప్పు.. చివరకు ఆర్థిక ఒత్తిడి తాళలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తాజాగా ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ నా2లో ఓ మహిళ అప్పుల ఒత్తిడి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఈ సమస్యను మరోసారి తెరపైకి తెచ్చింది.

**అప్పు తీర్చేందుకు గడువు కోరినా..**

కేతిరెడ్డి కాలనీకి చెందిన ఈశ్వరమ్మ గత నాలుగు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన రాజగోపాల్ వద్ద అప్పు తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నెలనెలా వడ్డీ చెల్లిస్తున్నామని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితులు బాగోలేక ఒక నెల వడ్డీ చెల్లించేందుకు ఆలస్యం అవుతుందని, తమ ఇంటిని విక్రయానికి పెట్టామని, ఇల్లు అమ్ముడైన వెంటనే అప్పు మొత్తం చెల్లిస్తామని చెప్పినా ఒత్తిడి కొనసాగిందని ఆమె భర్త నారాయణ ఆరోపించారు. రాత్రివేళల్లో ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేశారని, తమకు కొంత గడువు ఇవ్వాలని కోరినా వినలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

**శివారు కాలనీల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలే అధికం**

చెన్నకేశవపురం, వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, నా1, నా2, నా3 తదితర శివారు ప్రాంతాల్లో అధికంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు నివసిస్తున్నాయి. మగ్గం కార్మికులు, చిన్నచిన్న చేతివృత్తులపై ఆధారపడేవారు, దినసరి కూలీలు, చిరు వ్యాపారులు ఇలా రోజువారీ ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొచ్చే వారే ఎక్కువ. అనారోగ్యం.. పిల్లల చదువులు.. వివాహాలు.. కుటుంబ అవసరాలు.. ఇలా అత్యవసర పరిస్థితుల్లో తక్షణం డబ్బు అవసరమవుతుంది. బ్యాంకులు, అధికారిక ఆర్థిక సంస్థల ద్వారా రుణం పొందడం కష్టంగా మారినప్పుడు కొందరు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఇదే పరిస్థితి కొందరు అక్రమ వడ్డీ వ్యాపారులకు అవకాశంగా మారుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

**వారపు వడ్డీ.. అంతులేని అప్పుల బాధ**

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో వారానికి రూ.100కు రూ.5, రూ.10 చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధిక వడ్డీ కారణంగా అసలు కంటే వడ్డీ భారమే ఎక్కువయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. మరోవైపు కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థలు మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు అందిస్తున్నాయి. రుణం తీసుకున్న తర్వాత వారపు లేదా నెలవారీ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో కుటుంబ ఆదాయం సరిపోకపోతే ఒక రుణం తీర్చేందుకు మరో రుణం తీసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు.. కుటుంబాలపై తీవ్ర మానసిక ఒత్తిడిని కూడా కలిగించే సామాజిక సమస్య.

**పోలీసుల చర్యలు అభినందనీయం.. మరింత దృష్టి అవసరం**

ధర్మవరం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ విషయంలో పోలీసు యంత్రాంగం ఇటీవల ప్రత్యేక దృష్టి సారిస్తోంది. సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో కార్డన్ సెర్చ్‌లు నిర్వహించడం, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టడం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ధర్మవరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, అక్రమ కార్యకలాపాల అడ్డుకట్ట, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం పనిచేస్తున్నారు.

**ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసులు తీసుకుంటున్న ఈ చర్యలు అభినందనీయం.**

అయితే ఇదే తరహాలో పేద, మధ్యతరగతి కుటుంబాలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ వడ్డీ వ్యాపారులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**అక్రమ వడ్డీ వ్యాపారంపై ప్రత్యేక డ్రైవ్ చేయాలి**

పోలీసు యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పట్టణంలోని అక్రమ వడ్డీ వ్యాపారులపై దృష్టి సారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

- అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వ్యక్తులను గుర్తించడం;
- వారికి చట్టబద్ధమైన అనుమతులు, రిజిస్ట్రేషన్లు ఉన్నాయా లేదా పరిశీలించడం;
- అధిక వడ్డీలకు సంబంధించిన ఫిర్యాదులను సేకరించడం;
- అప్పు వసూళ్ల పేరుతో బెదిరింపులు, దుర్భాషలు, దాడులు చేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ చేయడం;
- గతంలో ఇలాంటి ఘటనలపై నమోదైన కేసులను సమీక్షించడం;
- బాధితులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించడం;
- చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**ఎస్పీ ప్రత్యేక దృష్టి సారిస్తే..**

ధర్మవరం పట్టణంలో శాంతిభద్రతల విషయంలో ఇప్పటికే ప్రత్యేక దృష్టి పెట్టిన ఎస్పీ సతీష్ కుమార్ అక్రమ వడ్డీ వ్యాపారంపై కూడా ప్రత్యేక నిఘాకు ఆదేశాలు ఇస్తే బాధిత కుటుంబాలకు ఎంతో భరోసా కలుగుతుంది. పట్టణంలోని అన్ని వార్డులు, ముఖ్యంగా శివారు కాలనీల్లో ఇలాంటి వ్యాపారం చేస్తున్న వారి వివరాలను సేకరించి, చట్టపరమైన అంశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఒక కుటుంబం కన్నీరు.. మరెన్నో కుటుంబాలకు హెచ్చరిక**

కేతిరెడ్డి కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటనను కేవలం ఒక కుటుంబ సమస్యగా చూడకూడదు. అప్పుల ఒత్తిడి ఒక కుటుంబాన్ని ఆత్మహత్య అంచుల వరకు తీసుకెళ్లిందంటే.. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న మరెన్ని కుటుంబాలు పట్టణంలో ఉన్నాయో గుర్తించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. అక్రమ వడ్డీ వ్యాపారంపై చర్యలు తీసుకోవడం అంటే కేవలం కొందరిపై కేసులు నమోదు చేయడం కాదు. అప్పుల బాధలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పించడం.. చట్టవిరుద్ధ వేధింపులకు అడ్డుకట్ట వేయడం.. పేద, మధ్యతరగతి ప్రజలకు రక్షణ కల్పించడం. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఇప్పటికే మంచి చర్యలు చేపడుతున్న పోలీసు యంత్రాంగం.. అక్రమ వడ్డీ వ్యాపారంపై కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

**అప్పు తీసుకున్నవాడు నేరస్థుడు కాదు..**

**అప్పు పేరుతో చట్టవిరుద్ధంగా వేధిస్తే మాత్రం చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందే.**

**ప్రజల ప్రాణాల కంటే ఏ వడ్డీ లెక్కా పెద్దది కాదు.**



అప్పుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ ఈశ్వరమ్మ



## ధర్మవరం మున్సిపాలిటీలో 48 వార్డులు

### డీలిమిటేషన్ ముసాయిదా విడుదల

### 11 వరకు అభ్యంతరాలకు అవకాశం

ధర్మవరం, సెప్టెంబర్ 5 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం పురపాలక సంఘంలోని ప్రస్తుత 40 వార్డులను 2011 జనాభా ప్రాతిపదికన 48 వార్డులుగా పునర్విభజిస్తూ డీలిమిటేషన్ ముసాయిదా జాబితాను అధికారులు విడుదల చేశారు. ముసాయిదా జాబితాను పురపాలక కార్యాలయం, తహశీల్దార్, ఆర్డీవో, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు వార్డు సచివాలయాల్లో ప్రజల పరిశీలనకు ఉంచారు. వార్డుల హద్దులపై ప్రజలు తమ సూచనలు, సలహాలు, అభ్యంతరాలను సెప్టెంబర్ 5 నుంచి 11వ తేదీలోగా కమిషనర్‌కు లిఖితపూర్వకంగా సమర్పించాలని అధికారులు కోరారు.



## కనిపించే దేవుళ్ళు ఉపాధ్యాయులు

### ::: లండన్ కిడ్స్ పాఠశాలలో టీచర్స్ డే

అరుణప్రభ 5 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లండన్ కిడ్స్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జన్మ దినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు విద్యార్థులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బూర పూర్ణ చందర్ మాట్లాడుతూ " అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది అని అన్నాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బూర పూర్ణ చందర్, బూర శరణ్య, ఏ ఓ గాడిపెల్లి సుమన్, ప్రిన్సిపల్స్ భూక్యా హిమబిందు, కుసుమ మీనాక్షి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: అయ్యన్నపాత్రుడు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

## సామాజిక విలువలు, క్రమశిక్షణ అంశాలను బోధించాలి
## ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
## 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట : విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల్లో సామాజిక విలువలు, క్రమశిక్షణ, మానవీయత, దేశభక్తి వంటి మంచి లక్షణాలను పెంపొందించేలా బోధన సాగాలని ఆయన సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమాన్ని శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, ఉపాధ్యాయులు వారికి జ్ఞానాన్ని అందించి జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి మార్గనిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, క్రీడా స్ఫూర్తి, సామాజిక బాధ్యత వంటి అంశాలను పెంపొందించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహనతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా విద్యార్థుల జీవితాలను మలిచే పవిత్రమైన బాధ్యతగా భావించాలని కోరారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమ సేవలను గుర్తించి సన్మానించడం పట్ల ఉత్తమ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు

నారాయణఖేడ్ నియోజకవర్గం



సిర్గాపూర్ మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామం మరియు ఉజలంపాడ్ తండాలో మరియు గైరాన్ తండా(గ్రా) మరియు నారాయణఖేడ్ మండల పరిధిలోని గంగాపుర్ గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశిస్తున్న లబ్ధిదారుల కుటుంబాలను ఎమ్మెల్యే గారు అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు సొంత ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసుకుంటున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుండటం సంతోషంగా ఉందని, ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పఠనం
## జ్ఞానానికి దారి దీపం

**(సెప్టెంబర్ 6జాతీయ**
**పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా)**

(పుస్తకం మనకు కొత్తలోకాన్ని
పరిచయం చేస్తుంది. అక్షరంతోడైతే
అజ్ఞానం చీకట్లు తొలగిపోతాయనే
వాక్యను స్ఫూర్తిగా తీసుకొనిరాసిన
కవిత.)
"కేవలం సమాచారాన్ని
సేకరించడం విద్య కాదు .
మన జీవితానికి మరియు
సృష్టిలోని అన్ని జీవులకు
మధ్య ఒక సామరస్యాన్ని
బంధాన్ని ఏర్పరిచేదే
నిజమైన చదువు
పుస్తకాలు ఆ బంధాన్ని
వెలిగించే కాంతి దీపాలు"
బి. రవీంద్రనాథ్ ఠాగూర్

కదిలిరా ఓయువత పఠనం వైపు
పుస్తకమే చూపును ప్రగతి వైపు
అక్షరాలంవెనుక ఉన్నది
అనంత జ్ఞనం చదివితే
మారును నీ ఆలోచనా విధానం

అక్షరాల వెలుగుల్లో అంతం
కాని ప్రయాణం పుస్తకాల
సావాసం మనిషికి సంస్కారం
పఠనమనే మంత్రంతో
తెరుచును వివేకం ప్రతి
పేజీ ఇచ్చును సరికొత్త లోకం

స్మార్ట్ ఫోన్ల మాయలో పడి
పుస్తకంతో స్నేహాన్ని మరవద్దు
పుస్తకాల తోటలో పూలను
కోల్పోకు సృజనను అడ్డుకోకు
పఠనం ఒత్తిడిని దూరం చేసే
సంజీవని అనితెలుసుకో

పఠనం జ్ఞాపకాల పదునుపెంచే
అమృత నిధి జ్ఞాపక శక్తిని పెంచే
జ్ఞాన నిధి ఆలోచనలకు ఆలంభణ
చిన్నగా మొదలుపెట్టు పఠన
ప్రయాణం ప్రతిభకు సానబెట్టు
ఫోన్ పక్కన బెట్టి పుస్తకంతో
గడిపితే విజయం నీకు
దాసోహమౌతుంది

కేవలం సమాచారం కాదు పుస్తకం
అంటే విజ్ఞాన సర్వస్వం
సృష్టితో మన అనుబంధాన్ని
పెంచే విజ్ఞాన కాంతి
ఆలోచనా చైతన్యాన్ని పెంచే
సాధనం పుస్తకం
పఠనంతో సహనం సంఘీభావం
జీవన సామరస్యం మనోవికాసం
మానవీయత వర్ధిల్లుతుంది

చరిత్ర పుటలను ఒకసారి తిరిగేయ్
మహానుభావుల చరిత్రలు చదివితే
గమ్యాలను చేరుతావు
పఠనం ఓటమిని గెలిపిస్తుంది
వ్యక్తిత్వ వికాసానికి సజీవచైతన్యం

యువత పుస్తకం
చేతబట్టు అజ్ఞానం
గోడలను
అక్షరంతో బద్దలు కొట్టు
నేటి నీపఠనమే రేపటి
నీప్రగతికి మార్గం
అని గుర్తుంచుకో
పఠనం జ్ఞానానికి దారిదీపం



**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ**
**ఎడ్యుకేషన్ ఫోరం**
**రచయిత కాలమిస్ట్**
**కరీంనగర్, 9440245771**

## అసెంబ్లీలో జీవో 97ను ఎండగడతాం..
## పాలిటెక్నిక్ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది: కేటీఆర్

**పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్ను**
**జీవో 97 వెనుక అసలు ఉద్దేశాన్ని బయటపెడతాం**



సిరిసిల్ల: పాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములు, ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు తీసుకొచ్చిన జీవో నంబర్ 97 వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతామని స్పష్టం చేశారు. జీవో 97ను రద్దు చేసే వరకు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు. జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులకు పైగా ఆందోళన చేస్తున్న సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను కేటీఆర్ కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఆవేదనను విన్నారు. విద్యార్థులు రోడ్డెక్కితే కేసులు పెడతామని ప్రభుత్వం భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌తో పాటు సిరిసిల్ల, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో విలువైన భూముల్లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలల వ్యవస్థను బలహీనపరిచి వాటి భూములను, ఆస్తులను ఇతర అవసరాలకు వినియోగించుకునే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఎల్లుండి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో జీవో 97 అంశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ప్రభుత్వం ముందు బలంగా ప్రస్తావిస్తారని కేటీఆర్ తెలిపారు. తాను సిరిసిల్ల ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా, ఈ జిల్లా బిడ్డగా విద్యార్థులకు అండగా నిలుస్తానని చెప్పారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలంతా కలిసి విద్యార్థుల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టిందని కేటీఆర్ అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు టీఎస్ఐపాస్ వంటి విధానాలను తీసుకొచ్చి పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. 2014లో తెలంగాణలో టెక్నాలజీ రంగంలో 3.23 లక్షల ఉద్యోగాలు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆ సంఖ్య 10 లక్షలకు చేరిందని, సుమారు 6.5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించామని వివరించారు. యువత నైపుణ్యాలను పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం టాస్క్, వి-హబ్ వంటి సంస్థలను ఏర్పాటు చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. టాస్క్ ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, హార్డ్ స్కిల్స్‌లో శిక్షణ అందించామని తెలిపారు. యువత ఉద్యోగాలు పొందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అవసరమైన వేదికలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, విద్యార్థులకు వివిధ దశల్లో ఆర్థిక సాయం, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ప్రశ్నించారు. విద్యార్థులపై పోలీసులు కేసులు పెట్టినా, ఎలాంటి వేధింపులకు గురిచేసినా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులపై నమోదైన కేసులను కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతామని చెప్పారు. జీవో 97ను రద్దు చేసే వరకు, ఎస్‌బీటీఈటీని కొనసాగించే వరకు విద్యార్థుల వెంట బీఆర్ఎస్ ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటంలో వెనక్కి తగ్గవద్దని, ప్రభుత్వం దిగివచ్చే వరకు అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## గౌడ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలంలోని గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధి, గౌడ కులస్తుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడిగా కొండ నర్సా గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పందిర్ల రవికాంత్ గౌడ్, కొండ దేవా గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పాముల లక్ష్మణ్ గౌడ్, కోశాధికారిగా పందిర్ల సుధాకర్ గౌడ్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఆకుల నాగభూషణం గౌడ్, కొండ చిన్న నర్సా గౌడ్ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కొండపర్శ గౌడ్, పాముల నాగరాజు, తీగల అంజా గౌడ్, పాముల వినయ్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కొండ నర్సా గౌడ్‌ను గౌడ సంఘం సభ్యులతో కలిసి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ గౌడ సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## తిరుమలలో భక్తుల వెల్లువ.. దర్శనానికి 20 గంటల నిరీక్షణ

వారాంతం కావడంతో తిరుమల గిరులు భక్తులతో కిక్కిరిశాయి. దేశం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం యాత్రికులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొండపై తీవ్ర రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సాధారణ సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు కాలినడక మార్గాలు, బయట రింగు రోడ్డు వరకు ఉన్న క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు నిరంతరం పాలు, తాగునీరు, అల్పాహారం అందజేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక శుక్రవారం ఒక్కరోజే 68,374 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,241 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ ప్రయాణాన్ని, దర్శనాన్ని తగిన జాగ్రత్తలతో ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# నాలెడ్జ్ ఐకాన్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ పై (అరుణ ప్రభ)ఉపాధ్యాయుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ సూరారంలోని నాలెడ్జ్ ఐకాన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, మహోన్నత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాలతో పాటు భావోద్వేగపూరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులే ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషిస్తూ తరగతి గదుల్లోకి వెళ్లి వివిధ అంశాలను ఎంతో ఆత్మవిశ్వాసంతో, చక్కగా వివరించారు. పాఠాలను సులభంగా, అర్థమయ్యే రీతిలో బోధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడి పాఠాలు బోధించడం ద్వారా గురువుగా ఉండటం వెనుక ఉన్న బాధ్యత, సహనం, కృషిని విద్యార్థులు ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ కార్యక్రమం వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయుల పట్ల మరింత గౌరవభావాన్ని కలిగించింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మేడమ్, కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ గారి ఆశీర్వాదాలను తీసుకున్నారు. కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమను ప్రోత్సహించి, అండగా నిలిచిన ప్రిన్సిపాల్ మేడమ్ మరియు కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ గారికి విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ మాట్లాడుతూ, "ఉపాధ్యాయుడు కేవలం పాఠాలను బోధించే వ్యక్తి కాదు.. విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి. ఒక మంచి ఉపాధ్యాయుడు అందించే జ్ఞానం, విలువలు, ప్రోత్సాహం విద్యార్థి జీవితంపై జీవితాంతం ప్రభావం చూపుతాయి. ఈరోజు మీరు ఉపాధ్యాయులుగా మారి తరగతులు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడి వారి బాధ్యతలను అర్థం చేసుకోవడం మీకు ఒక గొప్ప అనుభవం. భవిష్యత్తులో మీరు ఏ రంగంలో ఉన్నా, మీకు జ్ఞానాన్ని అందించిన గురువులను ఎప్పటికీ గౌరవించాలి" అని అన్నారు. అలాగే "ప్రతి విద్యార్థిలో ఒక మంచి భవిష్యత్తు దాగి ఉంది. ఆ భవిష్యత్తును వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులది. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, మానవతా విలువలను అలవర్చుకున్నప్పుడే విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సాధిస్తాడు" అని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడి, ఆనందం, గురువుల పట్ల వారి ప్రేమాభిమానాలతో నిండిపోయింది. గురువు--శిష్యుల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అందరి హృదయాలను హత్తుకున్నాయి.



# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు జీవితానికి దిశానిర్దేశం చేస్తారు**

**దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**ఉపాధ్యాయుల సేవలను కొనియాడిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



అరుణప్రభ న్యూస్ : ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5: విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేసి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో ఎస్పీ మహేష్ బి. గితే ఆత్మీయంగా మాట్లాడారు. వారి విద్యాభ్యాసం, భవిష్యత్తులో సాధించాలనుకుంటున్న లక్ష్యాలు, ఉన్నత విద్యపై వారి ఆలోచనలు, భవిష్యత్ ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో నిరంతరం కృషి చేయాలని సూచించారు.

**జీవితానికి దిశానిర్దేశం చేసేది గురువులే**

తల్లిదండ్రులు జన్మనిస్తే.. మన జీవితానికి జ్ఞానాన్ని అందించి, సరైన మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. "నేను ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా ఈ స్థాయిలో ఉన్నానంటే, నాకు విద్యాబుద్ధులు నేర్పి, మంచి మార్గాన్ని చూపించిన నా గురువుల పాత్ర ఎంతో ఉంది" అని ఎస్పీ మహేష్ బి. గితే తన గురువులను ఈ సందర్భంగా ఆత్మీయంగా గుర్తు చేసుకున్నారు. గురువులు విద్యార్థులకు దిక్సూచి వంటివారని, వారు చూపిన మార్గంలో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు

**ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, అందిస్తున్న సేవలను ఎస్పీ అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని అందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**సోషల్ మీడియా, గంజాయికి దూరంగా ఉండాలి**

విద్యార్థులు కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలో సోషల్ మీడియా వినియోగానికి పరిమితులు పాటించాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొప్పాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో నూతన తహసీల్దార్‌కు సన్మానం



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 05 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండలానికి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆడెపు దివ్య జ్యోతిని బొప్పాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొప్పాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలో రెవెన్యూ సంబంధిత సమస్యలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పరిష్కరించేందుకు నూతన తహసీల్దార్ కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖతో గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నూతన తహసీల్దార్ ఆడెపు దివ్య జ్యోతి గ్రామీణ ప్రాంత ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలు, ధరణి/భూ భారతి, పట్టాదారు పాస్‌బుక్కులు తదితర అంశాలపై సత్వర పరిష్కారం లభించేలా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, జీపీ ఓ అంజమ్మ, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి.

**కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి**

**కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి. మల్లారపు సంతోష్ రెడ్డి**

అరుణప్రభ న్యూస్, ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 05: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల్లోకి తీసుకెళ్లడంపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటి ద్వారా లబ్ధి పొందేలా ప్రజలకు సహకరించాలని నిర్ణయించారు.

**ప్రజా సమస్యలపై పోరాటానికి కార్యాచరణ**

రాబోయే రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మండలంలోని ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున నిర్వహించాల్సిన పోరాటాలపై సమావేశంలో చర్చించారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచేలా కార్యాచరణ రూపొందించాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.



కార్యకర్తలంతా సమన్వయంతో, ఐక్యంగా పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది ఏర్పడేలా నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలతో మమేకం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త చురుకైన పాత్ర పోషించాలని కోరారు. రాబోయే రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు దాసరి గణేష్, సింగరవేణి కృష్ణహరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మారెడ్డి, ఎస్టీ మోర్చా నాయకులు కిరణ్ నాయక్, మండల కమిటీ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు బస్సులు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

**విద్యార్థులకు స్వల్ప గాయాలు.. కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఘటన**



అరుణప్రభ న్యూస్ -- సిరిసిల్ల, సెప్టెంబర్ 5: సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శనివారం ఉదయం రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు ఉండటంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తుండగా, పెద్దూరు వైపు నుంచి వస్తున్న అపెరల్ పార్క్‌కు చెందిన బస్సు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న కొత్త బస్టాండ్ చౌరస్తాలో స్కూల్ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టినట్లు తెలిసింది. రెండు బస్సులు ఢీకొనడంతో స్కూల్ బస్సు అద్దాలు పగిలిపోయాయి. ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో వెంటనే వారికి చికిత్స అందించినట్లు సమాచారం. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి కొత్త బస్టాండ్ సమీపంలోనే ప్రధాన చౌరస్తా ఉండటంతో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రాకపోకలతో పాటు వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. వాహనాలు వేగంగా చౌరస్తాలోకి ప్రవేశిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసాధనంలో ఉపాధ్యాయ దినోత్సవం

శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాజీ రాష్ట్రపతి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం దేవరకొండ యందు వారి చిత్రపటానికి పూల మాల అలంకరించి నివాళులు అర్పించినారు. అనంతరం అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు నరసింహ రెడ్డి మరియు కొండభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీమతి ప్రభావతిలను పూలమాలతో, శాలువ కప్పి మొమంటో అందజేసి వారి సేవలను కొనియాడినారు.ఈ సందర్బంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ మమ్ములను సన్మానిం చినందులకు ధాన్యవాదములు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య,జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఇజాక్, పడమటి శాంతకుమారి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, తాడిశెట్టి సుదర్శన్, నందులాల్, మోటమర్రి పురుషోత్తం, రాములు చెన్నయ్య,కార్యవర్గం సభ్యులు, సభ్యులు 30 మంది పాలుగొన్నారు.



## బాకురుపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులకు ఘన సన్మానం



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ, కుల పెద్దల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ మండల, జిల్లా నాయకులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగతో పాటు మండల కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నూతన మండల కమిటీ జాతి సమస్యలపై ముందుండి పోరాడుతుందని నాయకులు తెలిపారు. అనంతరం బాకురుపల్లి సర్పంచ్‌ను కూడా శాలువాతో సన్మానించి, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నాయకులు మునిగే ఎల్లం మాదిగ, అధ్య సామ్యూల్ మాదిగ, మొక్క కిషన్ మాదిగ, గొట్టిముక్కల భాస్కర్ మాదిగ, బొడ్డు దేవయ్య మాదిగ తదితరులతో పాటు కుల పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం మరియు నూతన విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు

**నారాయణఖేడ్ నియోజకవర్గం**

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం మరియు నూతన విద్యార్థుల స్వాగతోత్సవ (ఖీతీవంష్ట్రవతీ'ం ఋుఎ) కార్యక్రమానికి గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ:.... ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని కొనియాడారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనం, హాస్టల్ వసతితో పాటు విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తోందని తెలిపారు. జూనియర్ కళాశాల దశ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నిర్దేశిత లక్ష్యంతో చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, రమేష్ చౌహన్, యాదవ్ రెడ్డి మాజీ సర్పంచ్,కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# మట్టి గణపతులనే పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

**:: జై గణేష్ భక్తి సమితి పిలుపు**



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (అరుణ ప్రభ) వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జై గణేష్ భక్తి సమితి పిలుపునిచ్చింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయన రంగులతో తయారు చేసిన గణపతి విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించింది. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమితి ఆధ్వర్యంలో మట్టి గణపతుల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల తయారీలో పీఓపీ, రసాయన రంగుల వినియోగం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. నిమజ్జనం సమయంలో ఈ విగ్రహాలు పూర్తిస్థాయిలో నీటిలో కరగకపోవడంతో చెరువులు, కుంటలు, నదులు, ఇతర జలవనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. రసాయన రంగుల్లోని హానికర పదార్థాలు నీటిలో కలవడం వల్ల జలచరాలకు, నీటి నాణ్యతకు నష్టం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

**మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు**

మట్టి గణపతి విగ్రహాలు సహజసిద్ధమైన పదార్థాలతో తయారవుతాయని, నీటిలో సులభంగా కరిగిపోయే అవకాశం ఉండటంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని సమితి సభ్యులు తెలిపారు. భక్తి, సంప్రదాయాలను పాటిస్తూనే ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమితి తరఫున విస్తృత కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. "మట్టి గణపతులను పూజిద్దాం -- ప్రకృతిని కాపాడుదాం" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని తెలిపారు. పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

**ప్రతి ఇంటా మట్టి వినాయకుడే**

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంట్లో మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించేలా ప్రజలను ప్రోత్సహిస్తామని జై గణేష్ భక్తి సమితి ప్రతినిధులు తెలిపారు. పర్యావరణహితమైన పండుగల నిర్వహణకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. పిల్లలు, యువతలో సైతం పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జై గణేష్ భక్తి సమితి అధ్యక్షులు ఎ. జైన్ కుమార్, చైర్మన్ ఆనంద్ రావు, నల్ల సురేష్ రెడ్డి, అన్నెం కోటి రెడ్డి, కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు యక్కంటి వెంకటరెడ్డి (ఎ=) తదితరులు పాల్గొన్నారు. పర్యావరణహితమైన మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సమితి సభ్యులు తెలిపారు.

# సాంకేతికతతో పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలి

## శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలి, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



అరుణప్రభ న్యూస్ । ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5: ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా విధులు నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సిబ్బంది నిర్వహించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్‌ను ఎస్పీ పరిశీలించి అభినందించారు. అనంతరం పోలీస్ స్టేషన్, సర్కిల్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా సమీక్షించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై కొనసాగుతున్న నిఘా, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న పోలీసు సేవలపై కూడా ఆరా తీశారు. సర్కిల్ పరిధిలో అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తూ పోలీసు శాఖపై మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. డయల్--112కు వచ్చే ప్రతి కాల్‌పై పోలీసులు వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి వేగంగా చేరుకోవాలని ఎస్పీ తెలిపారు. బాధితులకు సత్వర సహాయం అందిస్తూ, సమస్యలను చట్టపరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదకర డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎస్పీ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు రమేష్, శ్రీకాంత్, లక్ష్మణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ని యాత్రలు చేసినా.. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే.

### కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు నిర్ణయించుకున్నారు

### టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం



అరుణప్రభ న్యూస్ । ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5: తెలంగాణలో ఏ పార్టీకి చెందిన వారు ఎన్ని కుప్పిగంతులు వేసినా, ఎన్ని పాదయాత్రలు, మోకాలి యాత్రలు చేసినా రానున్న ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుమాల రోడ్డులో గన్న రాజిరెడ్డి కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం కటకం మృత్యుంజయం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముందు గ్రామ పురోహితులు రాచర్ల హనుమాన్ల శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిది రాజేందర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కటకం మృత్యుంజయం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం మినహా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని కటకం మృత్యుంజయం ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకవైపు అభివృద్ధికి, మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీలో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని కటకం మృత్యుంజయం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, సాంకేతిక కారణాల వల్ల కొంతమేర సమస్యలు ఏర్పడుతున్న మాట వాస్తవమేనని తెలిపారు. రైతులు సెల్‌ఫోన్ యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. యూరియా తమ పొలాలకు అందడం లేదనే రైతులు ఎక్కడైనా ఉన్నారా అని ప్రశ్నించిన ఆయన, బీఆర్‌ఎస్ నాయకులు యూరియా అంశంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనే ఉద్దేశంతో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. నేతన్నలు, గీతన్నలు, రైతులు, మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, సంస్కరణలు చేపడుతోందన్నారు. మండల స్థాయిలో కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు పూర్తయిందని, ఇక మండల కమిటీలు గ్రామ కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించి పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ షేక్ సాబేరా బేగం, గౌస్‌బాయి, వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దత్తాద్రి గౌడ్, ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు సాహెబ్, డైరెక్టర్లు మండే శ్రీనివాస్ యాదవ్, గుల్లపల్లి లక్ష్మారెడ్డి, మేడిపల్లి రవీందర్, తిరుపతిరెడ్డి, గణేష్, కృష్ణారెడ్డి, సర్పంచులు చిర్రం నాగరాజు యాదవ్, బాపురెడ్డి, మాదాసు శ్రావంతి బాబు, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, చెన్నిబాబు, రాములు, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, దండు శ్రీనివాస్ ముదిరాజ్, గుర్రాల రాజిరెడ్డి, ఎండ్ల రాజ్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్, నెమలికొండ సత్తయ్య, పందిల శ్రీనివాస్ గౌడ్, తిరుపతి గౌడ్, గంట బుచ్చగౌడ్, సిరిపురం మహేందర్, ఇమామ్‌బాయి, మల్లారెడ్డి దేవయ్య, మద్దుల శ్రీపాల్‌రెడ్డి, రఫిక్, అఫ్జల్, బీపేట రాజ్‌కుమార్, ఇలియాస్ బాబా, అంతెర్పుల గోపాల్, దొంతి రాజేందర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లాగౌడు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి పేటలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం.

## ఇచ్చిన హామీలతో పాటు చెప్పని పథకాలను అమలు చేస్తున్నాం: డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్.



అరుణప్రభ న్యూస్ । ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 5: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, ఎన్నికల సమయంలో చెప్పని అనేక సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, దళిత బంధు వంటి అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటు బడ్జెట్‌తో ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా పరిపాలన కొనసాగిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే రైతులు, మహిళలు, పేదలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని సంగీతం శ్రీనివాస్ తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్‌తో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**చెప్పని పథకాలను సైతం అమలు చేస్తున్నాం**

ఎన్నికల సమయంలో రేషన్ కార్డులు ఇస్తామని, సన్నబియ్యం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పకపోయినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల అవసరాలను గుర్తించి రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి సౌకర్యాలను అందిస్తున్నామని సంగీతం శ్రీనివాస్ అన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభంతో మండలంలో పార్టీ కార్యకలాపాలు మరింత చురుగ్గా కొనసాగాలని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిద రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్కే సాబేరా బేగం, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాష్ట్ర నాయకులు కటకం మృత్యుంజయం, చీటి ఉమేష్‌రావు, సర్పంచులు కల్లూరు బాపురెడ్డి, చిర్రం నాగరాజు, మామిళ్ల కిషన్, నెత్యట్ల లక్ష్మయ్య, జిల్లా నాయకులు దత్తాత్రేయగౌడ్, గిరిధర్ రెడ్డి, ఎస్కే సాహెబ్, సద్ది లక్ష్మారెడ్డి, ఎస్కే గౌస్, దేవానందం, గంట బుచ్చగౌడ్, చెన్నిబాబు, మర్రి శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ మూర్తి, రొడ్డ రామచంద్రం, బుగ్గ కృష్ణమూర్తి, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం చేయని పనులను చేసి చూపిచ్చాం ఎంపీ.ఎమ్మెల్యే




పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను వెయ్యి రోజుల్లో చేసి చూపించాం గౌరవ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ గారు గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు గారు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో నిర్వహించిన భారీ సంబరాలు,ర్యాలీలో పాల్గొన్న లిగౌరవ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ గారు గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు గారు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు . అనంతరం నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే సంజీవ రెడ్డి గారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గారి స్వగృహం నుండి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు కార్యకర్తలతో కలిసి బారి ర్యాలీ గా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది

తదనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని తెలియజేశారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేని ఎన్నో పనులను మేము వెయ్యి రోజుల్లో చేసి చూపించామని అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దగా చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలకు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను దగా చేయడంతో పాటు, రాష్ట్రాన్ని భారీ అప్పుల కుప్పగా మార్చి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపిందని ఎమ్మెల్యే గారు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గంలో 3,500 ఇండ్లను మంజూరు చేశామని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పండుగ వాతావరణం నెలకొన్నదని, త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇళ్లు ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని, నారాయణఖేడ్ నియోజకవర్గంలో దాదాపు వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు కొత్త రేషన్ కార్డులను అందించడంతోపాటు రేషన్ కార్డు పొందిన కుటుంబాలకు దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన లో నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను నెరవేర్చిందని తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గనికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్,47 కోట్లతో ఏటీసీ సెంటర్ మరియు 5 కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్క్,ఇండోర్ ఔట్డోర్ స్టేడియం, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఇచ్చిన మాట మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా 21 వేల కోట్ల రూపాయలతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి జీర్ణించుకోలేక, ఫ్రస్టేషన్కు గురవుతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకొని ఎంపీ, గ్రామ పంచాయతీ మరియు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ను చిత్తుగా ఓడించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచులు మాజీ సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు,యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## తుర్కపల్లి-కద్పల్ నూతన రహదారి పనుల పరిశీలన 40 ఏళ్ల ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని గౌరవ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు అన్నారు. నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి నుంచి పోతన్‌పల్లి, పల్గు తండా మీదుగా సిర్గాపూర్ మండలం కద్పల్ వరకు చేపడుతున్న నూతన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ:... “గత 40 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ‘మా గ్రామానికి రోడ్డు కావాలి’ అని దశాబ్దాలుగా వేడుకుంటున్న ప్రజల ఆకాంక్షను నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నెరవేర్చడం ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది.” “ప్రస్తుతం రోడ్డుకు సంబంధించిన మెటలింగ్ (ఔడీవీ/డీ బేస్) పనులు శరవేగంగా పూర్తయ్యాయి. మిగిలిన డాంబర్ (దీ కార్పెటింగ్) పనులను కూడా అత్యంత త్వరగా, పూర్తి నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.” అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ 40 ఏళ్లుగా రహదారి కోసం ఎదురుచూస్తున్న తమ కలను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు సాకారం చేస్తున్నందుకు తుర్కపల్లి, పోతన్‌పల్లి, పల్గు తండా, కద్పల్ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణంతో తమ గ్రామాల అభివృద్ధికి కొత్త మార్గం ఏర్పడుతుందని తెలిపారు. ఈ రహదారి పూర్తి కావడంపై స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తుర్కపల్లి, పోతన్‌పల్లి, పల్గు తండా, కద్పల్‌తో పాటు సమీపంలోని పోచపూర్, కాజాపూర్, బీబీపేట్, పతేపూర్ గ్రామాలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు, రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడానికి, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి ఈ రోడ్డు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889